
పీఎంఏజీవై నిధులతో గ్రామీణాభివృద్ధి

- రెండో విడతలో తొమ్మిది గ్రామాలకు చోటు
- కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పీఎంఏజీవై) నిధులతో దళిత జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పీఎంఏజీవై పథకం అమలుపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో ఈ పథకం ద్వారా మూడు గ్రామాలను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఓర్వకల్లు మండలంలోని బొడ్డు వానిపల్లె, ఆదోని మండలంలోని చాగి, ఎమ్మిగనూరు మండలంలోని ఏనుగుబాల గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. పనులు పూర్తిచేసిన వాటికి రెండు రోజుల్లోపు యుటిలైజేషన్ సర్టిఫికెట్లను సమర్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. రెండో విడతలో తొమ్మిది గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ సెంటర్లలో మరమ్మతుల పనులు, తాగునీటికి సంబంధించిన ఫిల్టర్‌బెడ్ సమస్యలను పంచాయతీరాజ్‌కు సంబంధించి మౌలిక సదుపాయాలు, అప్రోచ్‌రోడ్డు, ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను ఈనిధులతో చేపట్టాలన్నారు. జడ్పీ సీఈవో నాసరరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధిక పాల్గొన్నారు.

పీ-4పై సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమం త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వ కార్య దర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వర్ణాంధ్ర, పీ-4 ఫౌండేషన్, సానుకూల ప్రజాదృక్పథం, ఆర్‌టీజీఎస్ లెన్స్‌పై సూచనలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ పీ-4 ఫౌండేషన్‌కు సంబంధించిన గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఒక మార్గదర్శికి కొన్ని కుటుంబాలకు మాత్రం పరిమితం చేయాలని చీఫ్ సెక్రటరీని కలెక్టర్ కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, సీపీవో హిమప్రభాకర్ పాల్గొన్నారు.

ఎంపీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ (రాయలసీమ యూనివర్సిటీ) పరిధిలో ఎంపీఈడీ 3వ సెమిస్టర్ రెగ్యులర్/సప్లిమెంటరీ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు గురువారం విడుదల చేశారు. రెగ్యులర్ విభాగంలో 67కు 58, సప్లిమెంటరీ విభాగంలో 20మంది పరీక్షలు రాయగా 15 మంది ఉత్తీర్ణత సాధించారు. మరిన్ని ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలని పేర్కొన్నారు.

ఆగస్టు 2న స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఆగస్టు 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11 గంటల నుంచి 12 వరకు 3వ స్థాయి సంఘం, 12 గంటల నుంచి ఒంటి గంట వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం ఒంటి నుంచి 2 గంటల వరకు 4వ స్థాయి సంఘం, 2:30 గంటల నుంచి 3:30 వరకు 5వ స్థాయి సంఘం, 3:30 గంటల నుంచి 5:30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈవో వివరించారు.



మళ్లీ ఆశలు

ఆదోని పట్టణం ఏరియల్ వ్యూ

- తెరపైకి ఆదోని జిల్లా!
- నాలుగు మండలాలుగా ఆదోని?
- పలు గ్రామాలు సమీప మండలాల్లో కలిపే అవకాశం
- కర్నూలు జిల్లాలో డోన్, నందికొట్కూరు కలపాలని సర్వత్రా డిమాండ్లు
- జిల్లాలు, మండలాల పునర్విభజనపై మంత్రుల కమిటీ
- ఉమ్మడి జిల్లాలో మొదలైన రాజకీయ చర్చలు

గతంలో జగన్ ప్రభుత్వం పార్లమెంట్ స్థానాల ప్రాతిపదికన 2022లో జిల్లాల పునర్విభజన చేపట్టిన సంగతి తెలిసిందే. నాటి పునర్విభజన కారణంగా ఉమ్మడి కర్నూలు జిల్లా కర్నూలు, నంద్యాల జిల్లాలుగా విడిపోయాయి. నంద్యాల జిల్లా జలవనరుల రాజధానిగా మారితే, కర్నూలు జిల్లా కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా మిగిలింది. ఒక్కో లోక్‌సభ స్థానాన్ని ఒక్కో జిల్లాగా చేయడంతో కర్నూలు జిల్లా కేంద్రానికి సమీపంలోని డోన్, నందికొట్కూరు వంటి నియోజకవర్గాలు నంద్యాల జిల్లాలో కలిశాయి. నంద్యాల లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, కల్లూరు మండలాలు సహా కర్నూలు అర్బన్ వార్డులను కర్నూలు జిల్లాలోనే ఉంచారు. ఇదే క్రమంలో ఆదోని కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేసినా ఆచరణకు నోచుకోలేదు. 40 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రభుత్వం మండల వ్యవస్థ తీసుకొచ్చారు. మండలాల ఏర్పాటులో రాజకీయ జోక్యం పెరిగి పలు గ్రామాలు సమీపంలోని మండలాల్లో కాకుండా 30-40 కి.మీల దూరంలోని మండలాల్లో కలిపారు. తాజాగా జిల్లాల పునర్విభజన మంత్రుల కమిటీ జిల్లాల పేర్ల మార్పు, డివిజన్లు, మండలాలు, గ్రామాల సరిహద్దులపై విన్నపాలను పరిశీలిస్తోంది. ఈ క్రమంలో పునర్విభజనపై ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది.

కర్నూలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు ఎంతో ఘన చరిత్ర ఉంది. 1839లో బ్రిటీష్ ప్రభుత్వం వచ్చాక మద్రాస్ ప్రెసిడెన్సి జిల్లాల్లో కర్నూలు ఒకటిగా ఉండేది. స్వాతంత్ర్యం తరువాత మద్రాస్ రాష్ట్రంలో ఉన్న జిల్లా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం ఫలితంగా కర్నూలు రాజధానిగా 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించింది. 1956 అక్టోబరు 31 వరకు కర్నూలు రాజధానిగా కొనసాగిందింది. 1953 నుంచి 12 అసెంబ్లీ నియోజకవర్గాలు, 53 మండలాలతో రాయలసీమలో అతిపెద్ద జిల్లాల్లో కర్నూలు ఒకటిగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన వల్ల 14 నియోజకవర్గాలకు విస్తరించింది. రాజకీయంగా, చరిత్రాత్మకంగా, సాంస్కృతికంగా, భౌగోళికంగా ఎంతో ఘన చరిత్ర కలిగిన కర్నూలు.. 2022లో జిల్లాల పునర్విభజన కారణంగా గత వైభవాన్ని కోల్పోయింది. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, నియోజకవర్గాలు పూర్తిగా, పాణ్యం నియోజకవర్గం పరిధిలో రెండు మండలాలు కలిపి 26 మండలాలతో కర్నూలు జిల్లా మిగిలింది. అదేవిధంగా నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం, బనగానపల్లె, నందికొట్కూరు, డోన్ నియోజకవర్గాలు, పాణ్యం నియోజకవర్గంలోని పాణ్యం, గడివేముల మండలాలు కలిపి 27 మండలాలతో నంద్యాల జిల్లాగా ఆవిర్భవించింది. అయితే సాగునీటి ప్రాజెక్టులు నంద్యాల జిల్లాలో ఉండడంతో జలవనరుల రాజధానిగా మారింది. అప్పట్లో ఆదోని జిల్లా చేయాలని డిమాండ్ వచ్చినా పట్టించుకోలేదు.

మళ్లీ తెరపైకి ఆదోని జిల్లా

జిల్లాల పునర్విభజనలో భాగంగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఓ కమిటీని మంగళవారం నియమించింది. జిల్లాల పేర్ల మార్పు, డివిజన్లు, మండలాలు, గ్రామాల సరిహద్దులపై ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించి పరిశీలించడంతో పాటు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఆ నివేదిక ఆధారంగా మంత్రివర్గం, అసెంబ్లీలో చర్చించి పునర్విభజనపై కూటమి ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది.



ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం

మిగతా 6వ పేజీలో

యూరియా పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు

- కలెక్టర్ రంజిత్ బాషా
- రైతులు ఆందోళన చెందొద్దు
- జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు అగ్రికల్చర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): యూరియాను పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. యూరియా కోసం రైతులు నిరసనలు చేపడుతున్న నేపథ్యంలో గురువారం ఆయన వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్ సెంటర్లలో యూరియాను రైతులకే అందించాలని అన్నారు. రైతుల పేరుతో ఇతరులు యూరియాను తీసుకుంటే విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జేసీ నవ్య మాట్లాడుతూ జిల్లాలో కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని, యూరియా విషయంలో రైతులు ఆందోళనలు చెందొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఈనెల 24 నాటికి 18,845 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 32,154 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. 2,147.39 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావాల్సి ఉందన్నారు. నాలుగైదు రోజుల్లో ఈ యూరియా జిల్లాకు వస్తుందన్నారు. రైతులు వ్యవసాయాధికారులు సూచనల మేరకే ఎరువులను వినియోగించాలన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ, ఎస్పీ

- నేర నియంత్రణకు కృషి చేయాలి
- డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్
- ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసాపత్రాలు

7

శ్రీశైలంలో హుండీల లెక్కింపు

- దేవస్థానానికి రూ.4.17 కోట్ల ఆదాయం
- ఈవో శ్రీనివాసరావు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలోని హుండీలను గురువారం ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యం లో లెక్కించారు. 27 రోజులకు గాను హుండీలను లెక్కించగా రూ.4,17,61,215 నగదు, 225గ్రాముల 600మిల్లీ గ్రాముల బంగారు, 11కేజీల 500గ్రాముల వెండి లభించినట్లు ఈవో తెలిపారు. 475 యుఎస్‌ఏ డాలర్లు, 70 యుఏఇ దిర్హమ్స్, 1300 ఓమన్ బైసా, 155 కెనడా డాలర్లు, 305 ఆస్ట్రేలియా డాలర్లు, 40 ఇంగ్లాండు పౌండ్స్, 2సింగపూర్ డాలర్లు, 50న్యూజిలాండ్ డాలర్లు, 5స్కాట్లాండ్ పౌండ్స్, 30 ఈరోస్, 1సౌదీరియాల్స్, 51కత్తార్ రియాల్స్, 1మలేషియా రింగిట్స్, 200 ఇథోపియాన్ బిర్, 220 శ్రీలంక కరెన్సీ రూపాయలు, 160 నేపాల్ రూపాయలు మెదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండీ లెక్కింపులో లభించాయి. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అన్ని యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- ఎన్నికల బరిలో ఏడుగురు కార్పొరేటర్లు
- ఇప్పటికే వైసీపీ సభ్యులు ఖరారు
- నామినేషన్లు వేయని టీడీపీ అభ్యర్థులు

కర్నూలు న్యూసిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం గురువారం ముగిసింది. చివరి రోజు నగర పాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణకు వైసీపీకి చెందిన ఏడుగురు కార్పొరేటర్లు నామినేషన్లు అందజేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ఉంటుంది. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, సీ3 క్లర్క్ శ్రీకాంత్ ఉన్నారు.

వెనక్కి తగ్గిన టీడీపీ ..

గత సంవత్సరం కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి సుమారు ఎనిమిది మంది కార్పొరేటర్లు చేరారు. దీంతో ఈసారి ఎలాగైనా టీడీపీ నుంచి కమిటీలో స్థానం సంపాదించాలని అప్పుడు ఐదుగురు కార్పొరేటర్లు నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఒక్క స్థానం కూడా సాధించుకోలేకపోయారు. ప్రస్తుతం కూడా ఇద్దరు నామినేషన్ వేయాలని కార్యాలయానికి వచ్చారు. ఈ క్రమంలో నామినేషన్లు వేయరాదని అధిష్టానం నుంచి సమాచారం రావడంతో టీడీపీ కార్పొరేటర్లు వెనక్కి వెళ్లిపోయారు. ఈ సంవత్సరం కూడా వైసీపీ కార్పొరేటర్లే స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికలకు మార్గం సుగమమైంది. 2026లో వచ్చే కార్పొరేషన్ ఎన్నికలతో కేవలం 8 నెలలు మాత్రమే ఉంటుంది. దీని కోసమే టీడీపీ కార్పొరేటర్లు ముందుకు రాలేదనే వాదన వినిపిస్తోంది.

వైసీపీ కార్పొరేటర్లు బరిలో..

ఐదుగురు కమిటీ సభ్యులకు మొత్తం ఏడుగురు వైసీపీ కార్పొరేటర్లు బరిలో ఉన్నారు. ఇప్పటికే ఐదుగురు కార్పొరేటర్లను సభ్యులుగా ఏకగ్రీవం చేసుకునేందుకు అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో 28వ వార్డు కార్పొరేటర్ ఇ.నారాయణరెడ్డి, 34వ వార్డు కార్పొరేటర్ వై.వెంకటేశ్వర్లు, 39వ వార్డు కార్పొరేటర్ సీహెచ్.సాంబశివరావు, 43వ కార్పొరేటర్ కురువ మునెమ్మ, 50వ వార్డు కార్పొరేటర్ ఎస్‌టీ.షేక్ అహ్మద్ ఏకగ్రీవబరిలో ఉన్నారు. అయితే అదనపు అభ్యర్థులుగా 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, 1వ వార్డు కార్పొరేటర్ షాషాలి కూడా నామినేషన్లు వేశారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్లు

కీలక ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం..!

- అవుకులో 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్
- రూ.53 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ రక్షణ పనులు
- డోన్‌లో రెండు పవర్ ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

7

శ్రావణం.. పరమపవిత్రం...



- ఆధ్యాత్మిక భావాలకు నెలవు
- సంప్రదాయాలకు కొలువు
- నేటి నుంచి 'శ్రావణ మాసం' ఆరంభం

కర్నూలు కల్చరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు మాసాల్లో ఎంతో విశిష్టమైనదిగా భక్తులు భావించే 'శ్రావణ మాసం' శుక్రవారం ప్రారంభమవుతోంది. ఆషాఢ మాసం సందర్భంగా నెలరోజుల పాటు శుభకార్యాలకు దూరంగా ఉన్న ఉమ్మడి జిల్లా వాసులు పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఇతరత్రా శుభకార్యాలకు ఈ మాసంలో శ్రీకారం చుట్టనున్నారు. మరోవైపు ఆయా ప్రాంతాల్లోని దేవాలయాల్లో, ఉమ్మడి జిల్లాలోని పుణ్యక్షేత్రాల్లో శ్రావణ మాసం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో జిల్లాలో యాత్రికుల సందడి కూడా బాగా పెరగనుంది. శ్రావణమాసం ప్రత్యేకించి మహిళలకు ఎంతో ప్రీతికరమైనది. ఈ మాసం ధార్మిక, ఆధ్యాత్మిక, భక్తిభావుకత అంశాలతో ముడిపడి ఉండటంతో పాటు వివాహ, గృహ ప్రవేశ, గృహ నిర్మాణ, నామకరణ మహోత్సవాల వంటి అనేక శుభకార్యాలకు విడిదిగా నిలుస్తోంది. పెళ్లి సంబంధాల నిర్ణయానికి, పెళ్లిళ్ల నిర్వహణకు అనువైన మాసం కావడంతో మాసారంభం కోసం అన్నివర్గాల వారు ఎదురు చూస్తుంటారు. ఆషాఢ మాసం గురువారంతో ముగిసిపోగా శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతోంది.

మిగతా 6లో...



ప్రతి ఇంట్లో పసిపిల్లలు పారాడితే చూడాలనుకునే పెద్దలు.. వారి బోసి నవ్వులతో మురిసిపోవాలనుకునే జంటలు చాలామంది ఉన్నారు. మహిళలు అమ్మతనం కోసం ఆరాట పడుతుంటారు. పలు కారణాలతో సంతాన లేమి సమస్య పెరుగుతూ వస్తోంది. వీటిని అధిగమిస్తూ వైద్య రంగంలో ఐవీఎఫ్ విధానం ఆవిష్కృతమైంది. 1978 జూలై 25న లూయిస్ జాయ్ బ్రౌన్ ఐవీఎఫ్ ద్వారా జన్మించిన మొదటి శిశువు. సంతానోత్పత్తి చికిత్స రంగంలో ఇది అతిపెద్ద విజయం. ఈ విజయానికి గుర్తుగా ప్రతి ఏడాది జూలై 25న ప్రపంచ ఐవీఎఫ్ డేగా జరుపుకుంటున్నారు. ఈ ఏడాది సంతానోత్పత్తి శాస్త్రంలో ఆవిష్కరణ, ఆశను జరుపుకోవాలి అన్న నినాదంతో నిర్వహిస్తున్నారు.

- సంతానప్రాప్తికి సాఫల్య చికిత్స
- 30 ఏళ్లలో దాటిన స్త్రీలలో తగ్గుతున్న సంతాన సామర్థ్యం
- కర్నూలులో 1.80, నంద్యాలలో 1.36 సంతానం రేట్
- నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే

అమ్మతనం కోసం ఆరాటం

కర్నూలు హాస్పిటల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పూర్వకాలంలో సంతానం లేనివారు తమకు జీవితంలో తల్లిదండ్రులు అయ్యే యోగ్యం లేదని సరిపెట్టుకునేవారు. ప్రస్తుతం వైద్యశాస్త్రం అభివృద్ధి చెందింది. కృత్రిమంగా గర్భధారణ చేసే విధానాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఆరు మందిలో ఒకరు సంతాన లేమితో బాధపడుతున్నారు. కర్నూలు జిల్లాలో ఫెర్టిలిటీ రేటు (2023-24) (టీఎఫ్ఆర్) 1.80గా ఉండగా.. నంద్యాల జిల్లాలో టీఎఫ్ఆర్-1.36గా నమోదైంది. వివాహాలు ఆలస్యంగా చేసుకోవడం, మారుతున్న జీవనశైలి మార్పులు, మగవారిలో కణాలు తగ్గిపోవడం వంటి కారణాలతో టీఎఫ్ఆర్ రేటు తగ్గుతున్నది.

జీవనశైలిలో లోపాలే..

సంతానలేమికి జీవనశైలిలో లోపాలే ప్రధాన కారణం. గర్భం దాల్చడానికి ముందు నుంచే శరీరంలోని ప్రతి కండరం కదిలేలా వ్యాయామం చేయాలి. లేదంటే శరీరంలో ఇన్సులిన్ రెస్టిలెన్స్ పెరిగి ప్రీడయాబెటిక్ దశకు చేరుకుంటారు. దీంతో గర్భం దాల్చలేకపోవడం, ఒకవేళ వచ్చినా అబార్షన్ కావడం, మధుమేహం, ఇన్‌ఫెక్షన్లు పిల్లలో ఊపిరితిత్తుల సమస్యలెన్నో ఎదురు కావచ్చు. కార్బొహైడ్రేట్స్ తగ్గించి ప్రోటీన్ ఫుడ్ తీసుకోవాలి. వేడి ఆహారం తీసుకుంటూ, రక్తహీనత లేకుండా చూసుకోవాలి. ఒత్తిడికి దూరంగా ఉండాలి. లేకపోతే గర్భస్రా వం నెలలు నిండకుండానే ప్రసవం అవ్వొచ్చు.

ఐయూఐ: దీన్ని ఇంట్రా యూటరిన్ ఇన్‌సెమినేషన్ అంటారు. భర్త నుంచి సేకరించిన వీర్యాన్ని ప్రయోగశాలలో పరీక్షిస్తారు. వీర్యంలో అసహజ కణాలు వంటివాటిని తొలగిస్తారు. ఆరోగ్యంగా ఉన్న వీరాన్ని సన్నటి, మెత్తటి గొట్టం ద్వారా నేరుగా స్త్రీ గర్భాశయంలోకి ప్రవేశపెడుతారు.



పెరిగిపోతున్న టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లు

15 ఏళ్ల క్రితం కర్నూలు నగరంలో ఒక్కటే టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ఉండేది. రోజురోజుకు వీటి సంఖ్య పెరిగిపోతోంది. ప్రస్తుతం నగరంలో దాదాపుగా పది దాకా టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్లు ఉన్నాయి. హైదరాబాదుకు చెందిన కార్పొరేట్ సంస్థలు కూడా కర్నూలులో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం విశేషం.

ఐవీఎఫ్: ఐవీయూ పద్ధతిలో ఫలితం కనిపించని వారికి ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) చికిత్స చేస్తారు. దీన్నే టెస్ట్ ట్యూబ్ బేబీ అంటారు. ఇందులో ఆడవారి నుంచి పక్వమైన అండాలను బయటకు తీసి ప్రయోగశాలలో ఒక పాత్ర పెట్టి, మగవారి వీర్యకణాలతో ఫలదీకరణ చెందిస్తారు. ఈ ప్రక్రియలో ఏర్పడిన తొలిదశ పిండాల్లో రెండు మూడింటిని ఆడవారి గర్భంలో ప్రవేశపెడుతారు. అవి పెరగడం మొదలవుతాయి.

ఐసీఎస్: ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్. ఇందులో ఆడవారి నుంచి అండాలను సేకరించి, మగవారి వీర్యంలోంచి ఒక శుక్ర కణాన్ని తీసుకుని దాన్ని మైక్రోమానిప్యులేటర్ పరికరం ద్వారా అండంలోనికి ప్రవేశపెడుతారు. ఫలదీకరణ చెందిన వాటిని తిరిగి స్త్రీగర్భంలోకి ప్రవేశపెడుతారు. వీర్యకణాల సంఖ్య చాలా తక్కువగా ఉన్న మగవారిలో ఇది ఉపయోగపడుతుంది.



ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం..



2015లో కర్నూలులో విష్ణు ప్రియా టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్‌ను ప్రారంభించాం. ఇప్పటి వరకు వేయి మందికి సంతాన సాఫల్య చికిత్సలు అందించాం. ఆలస్యంగా వివాహం చేసుకోవడం మంచిది కాదు. ఒత్తిడి, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. పెళ్లయిన తర్వాత ఏడాదికి పిల్లలు కలగకపోతే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ పి. విష్ణుప్రియ, విష్ణుప్రియా టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్, కర్నూలు

75 శాతం అధిక విజయం..



సంతాన సాఫల్య కేంద్రాల్లో ఒయాసిస్ ఫెర్టిలిటీ కేంద్రం ఐవీఎఫ్ ద్వారా 70నుంచి 75శాతం అధిక విజయం సాధించింది. కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించి తక్కువ ఖర్చుతో గర్భదారణను సాధించడం ఒయాసిస్ ద్వారా సాధ్యమైంది. మహిళల్లో వయస్సు పెరిగే కొద్ది వారిలో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది.

- డాక్టర్ దాసరి విజయలక్ష్మి, ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్, కర్నూలు

శ్రావణం.. పరమపవిత్రం...



(5వ పేజీ తరువాయి)

శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలు పెళ్లయిన, పెళ్లికాని ఆడవాళ్లకి ఎంతో ముఖ్యమైన వారాలుగా భావిస్తారు. ఈ ఏడాది ఈ మాసంలో ఐదు శుక్రవారాలు విచ్చేస్తున్నాయి. శ్రావణ మాసం శుక్రవారం రోజున ప్రారంభమవు తోంది. ఇందులో 2వ శుక్రవారం చాలా ముఖ్యమైంది. అది శుక్ల పక్ష పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఆరోజే 'వరలక్ష్మి వ్రతం' చేస్తారు. ఇది ముఖ్యంగా పెళ్లయిన ముత్తైదువులు చేసుకుంటారు. ఈ వ్రతం వల్ల లక్ష్మీదేవి కరుణా కటాక్షాలు అందుకుని సకల సిరిసంపదలు, పుత్ర పౌత్రభివృద్ధి, సుఖ సంతోషాలు కలుగుతాయని ప్రతీతి. శ్రావణ మంగళవారాలు కూడా ఎంతో భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. దీనికి శ్రావణ మంగళవారం నోము ఉంటుంది. ఇది ఆచరిస్తే సౌభాగ్యవంతులు అవుతారని నమ్మకం. శ్రావణ మాసంలోని మంగళవారాల్లో చేసే 'మంగళ గౌరీ' వ్రతాలను గౌరీ నోములని కూడా అంటారు. ఈ వ్రతాలు చేస్తే వరలక్ష్మీ కటాక్షం, మంగళగౌరీ కటాక్షం కలుగుతాయని మహిళలు వీటిని ఆచరిస్తారు.

ఉమ్మడి జిల్లాలో శ్రావణ శోభ

ఉమ్మడి జిల్లాలో శ్రావణ మాసాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఒక సంప్రదాయంగా వస్తోంది. శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, అహోబిలం, యాగంటి, తదితర సుప్రసిద్ధ దేవాయాలు, అనేక ధార్మిక కేంద్రాలకు నిలయంగా ఉన్న జిల్లాలో శ్రావణ మాసంలో భక్తుల సందడి కనిపిస్తోంది. శివకేశవులకు నెలవైన మాసం కావడంతో అన్ని వర్గాల భక్తులు తమ ఆరాధ్య దైవాలను పూజించేందుకు తరలివస్తారు. ఈ మాసం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంటుంది. పెళ్లిళ్లు, వ్రతాలు, పూజలు, శుభకార్యాల వంటి వాటితో ఇల్లంతా సందడిగా ఉంటుంది. ఈ మాసంలో ఒక్కోరోజు ఒక్కో దేవున్ని పూజిస్తారు. సోమవారాల్లో శివునికి అభిషేకాలు, మంగళవారం గౌరీ వ్రతం, బుధవారం విఠలుడికి పూజలు, గురువారాల్లో షిరిడి సాయి, సత్యసా యి పూజలు, గురుదేవుని ఆరాధనలు, శుక్రవారాల్లో లక్ష్మీ, తులసి పూజలు, శనివారాల్లో తిరుమలేశునికి, హనుమంతునికి, శనీశ్వరుని పూజలు నిర్వహిస్తారు.

ఉరుకుంద ఈరన్నకు అమావాస్య పూజలు

కౌతాళం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. అమావాస్య కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు లక్ష పుష్పార్చన సేవలు కొనసాగించారు. అంతకుముందు ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు వెండి అలంకరణ చేపట్టి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.



వాన కురిసె.. ఆనందం వెల్లివెరిసె..!

- జలకళను సంతరించుకున్న వాగులు, వంకలు
- పెరుగుతున్న భూగర్భజలాలు
- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- అందుబాటులో ఎరువులు : వరలక్ష్మి జేడీ



తుంగభద్ర నదికి జలకళ

ఈసారి మళ్లీ కరువు పరిస్థితులు చూడాల్సి వస్తుందేమోనని కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల రైతులు ఆందోళన చెందారు. ఒక వైపు ఎండిపోతున్న పైర్లు, మరో వైపు పొలాల్లో విత్తనం వేసేందుకు అవసరమైన వర్షం లేక జూలై నెలారంభంలో రైతులు వరుణదేవుడా కరుణించవయ్యా అంటూ ప్రార్థించారు. ఇదే సమయంలో వరుణుడు కనికరించాడు. వానలు కురియడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భూగర్భజలాలు పెరిగాయి. చెరవులు, వాగులు, వంకలు నిండాయి. అన్నదాత సాగుకు సిద్ధమయ్యాడు.

కర్నూలు అగ్రికల్చర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వానలతో రైతుల్లో ఆనందం వెల్లివెరిసింది. కర్నూలు జిల్లాలో ప్రధానంగా పశ్చిమ ప్రాంతం జలకళను సంతరించుకుంది. చెరువులు, వాగులు, వంకల్లోకి జలాలు వచ్చి చేరుతున్నాయి. భూగర్భజలాలు కూడా పెరుగుతున్నాయి. ఇప్పటికే 60 శాతం పొలాల్లో పంటల సాగు జరిగింది. ఖరీఫ్ సాగు ఊపందుకుంది. జూలై నెలలో 72ఎంఎం కురవాల్సి ఉండగా.. ఇప్పటికే 74ఎంఎం వర్షం నమోదైంది. ఈనెలాఖరుకు ఇంకా వర్షపాతం ఊపందుకుంటుం దని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరో వారం రోజులు ఇలాగే వర్షం పడుతుందని చెబుతున్నారు. పత్తికొండ, కల్లూరు, కర్నూలు రూరల్, ఎమ్మిగనూరు, ఆలూరు, చిప్పగిరి, పాణ్యం, ఆదోని, హాలహర్వి మండలాల్లో అత్యధికంగా వర్షపాతం నమోదైంది. ఒక వైపు తుంగభద్ర నదికి వరద పోటెత్తుతుండటంతో ఎల్లెల్సీ, కేసీ కెనాల్ కాలువలకు నీటిని వదులుతున్నారు. దీంతో ఆయకట్టు రైతులు వరి పంటను సాగు చేసేందుకు పొలం పనుల్లో బిజీ అయిపోయారు.

రానున్న వారం రోజుల్లో..



నాలుగు రోజులుగా వర్షాలు నేల తల్లిని తడిమేశాయి. అన్నిప్రాంతాల్లోనూ పంటల సాగుకు అనుకూలత ఏర్పడింది. ఇప్పటికే పొలాల్లో ఉన్న పైర్లు పచ్చగా కళకళాడుతుండటంతో కలుపులు తీసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. చెరువులకు నీరు క్రమంగా చేరుకుంటుంది. బోర్లు, బావుల్లోనూ భూగర్భ జలమట్టం పెరుగుతోంది. దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్య బాధలు తప్పిపోయాయి. రానున్న వారం రోజుల్లో ఇదే వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

60శాతం దాకా పంటల సాగు..



రైతులు ప్రస్తుతం పొలం పనుల్లో నిమగ్నవ య్యారు. జిల్లా అంతటా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. ఇప్పటికే 60శాతం దాకా పంటల సాగు పూర్తయింది. యూరియాతో పాటు డీఏపీ కాంప్లెక్స్ ఎరువులు మార్క్‌ఫెడ్ ద్వారా డీసీఎంఎస్ కేంద్రాలు గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సంఘాలకు సరిపడ నిల్వలను అందుబాటులో ఉంచాం. ఎక్కడా యూరియా కొరత లేదు.

- వరలక్ష్మి, జేడీ, కర్నూలు

తెలుగు వారి గుండెల్లో 'జాషువా' స్థానం పదిలం



ప్రజాకవి గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి గుండెల్లో నవయుగ కవి చక్రవర్తిగా గుర్రం జాషువా స్థానం పదిలంగా నిలిచే ఉంటుందని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, కళారత్న పత్తి ఓబులయ్య కొనియాడారు. గురువారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో గుర్రం జాషువా 55వ వర్ధంతి సభని నిర్వహించారు. తొలుత జాషువా చిత్ర పటానికి పూలదండలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ జాషువా ప్రజల పక్షాన నిలబడి రచనలు చేశారని, అందుకే ఆయన ప్రజా కవిగా నిలిచిపోయారన్నారు. ఆయన రాసిన గబ్బిలం, ఫిరదౌసి, ఆంధ్రభోజుడు, కాందిశీకుడు, శ్మశానవాటిక, క్రీస్తు చరిత్ర వంటి అనేక రచనలు ఔత్సాహిక రచయితలకు స్ఫూర్తినిస్తాయన్నారు. హరిశ్చంద్ర నాటకం కాటిసీనులో జాషువా పద్యాలతో ఒక ప్రత్యేకత చూపారని కొనియాడారు. ఆయన రాసిన క్రీస్తు చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందని గుర్తు చేశారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం ద్వారా కళాప్రపూర్ణ, భారత ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్ అందుకున్న మహనీయుడు జాషువా అన్నారు. కథా రచయిత ఇనాయతుల్లా వ్యాఖ్యానంతో ప్రారంభమైన ఈ సభలో రంగస్థల కళాకారులు, రిటైర్డ్ హెచ్ఎం మహ్మద్ మియా, పి.దస్తగిరి, కేవీ రమణ, సిద్దయ్య, శామ్యూల్ జాషువా పద్యాలు ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం ప్రతినిధులు పి.రాజారత్నం, క్రిష్టపర్, కె.బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, చంద్రకంటి మద్దయ్య, సంగీత గురువు బలరాం తదితరులు పాల్గొన్నారు.

పచ్చదన ప్రవాహం



పచ్చని చెట్ల మధ్య తెలుగుగంగ కాల్వలో కడప వైపు పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

నల్లమల తీరంలోని తుండ్లవాగు రిజర్వాయరులో తెలుగుగంగ కాల్వ అందాలు గురువారం కనువిందు చేశాయి. తుండ్లవాగు రిజర్వాయరు నుంచి పచ్చని వృక్షాల మధ్య ప్రధాన కాల్వలో కడప వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ఎక్కడో కోనసీమ, కేరళ ప్రాంతాల్లో కనిపించే అద్భుత నదీ ప్రవాహ దృశ్యాలు నంద్యాల జిల్లాలోనూ ఇలా కనువిందు చేస్తున్నాయి.

- రుద్రవరం(ఆంధ్రజ్యోతి)

కౌలూరు సర్పంచ్‌కు అరుదైన గౌరవం


ఢిల్లీలో జరిగే పంద్రాగస్టు వేడుకలకు ఆహ్వానం



ఊడల బాలయ్య

పాణ్యం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాణ్యం మండలంలోని కౌలూరు సర్పంచ్ ఊడల బాలయ్యకు అరుదైన గౌరవం లభించింది. దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం అందింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ గురువారం అధికారికంగా వెల్లడించినట్లు కౌలూరు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. ఢిల్లీలో జరిగే పంద్రాగస్టు వేడుకలకు రాష్ట్రంలో ముగ్గురిని ఎంపిక చేయగా వారిలో కౌలూరు సర్పంచ్ బాలయ్య ఎంపికయ్యారన్నారు. సర్పంచ్ బాలయ్య మాట్లాడుతూ గ్రామంలోని అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రజా సౌకర్యాలు, పారిశుధ్యం తదితర విభాగాల్లో కృషి చేయడంతోనే ఈ అవకాశం దక్కిందన్నారు. ఇంత గొప్ప అవకాశం లభించడంలో ఎంపీటీసీ భాస్కరరెడ్డితోపాటు పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజల సహకారం కారణమన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కినందుకు ప్రభుత్వానికి, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మళ్లీ ఆశలు



(5వ పేజీ తరువాయి)

2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేడితే, ఆదోని కేంద్రంగా ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల (పాత రెవెన్యూ డివిజన్)ను కలుపుతూ ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ వచ్చింది. ఆదోని జిల్లా సాధన సమితి ఏర్పాటుచేసి పలువురు పోరాటాలు కూడా చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజనకు మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడంతో మళ్లీ ఆదోని జిల్లా తెరపైకి వచ్చింది. 2027లో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొత్తగా రెండు లేదా మూడు నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉంది. కర్నూలు, కోడుమూరు, పాణ్యం, నందికొట్కూరు, డోన్, కొత్తగా ఏర్పడే నియోజకవర్గంతో కలిపి ఆరు నియోజవకార్గతో కర్నూలు జిల్లా, నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, శ్రీశైలం, కొత్తగా ఏర్పడే మరో నియోజకవర్గంతో కలిపి ఐదు నియోజకవర్గాలతో నంద్యాల జిల్లాను కొనసాగించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది.

నాలుగు మండలాలుగా ఆదోని

జిల్లాలో అతిపెద్ద మండలం ఆదోని. 46 రెవెన్యూ గ్రామాలు, 40 గ్రామ పంచాయతీలు ఉన్నాయి మండలం. 2011 గణాంకాల ప్రకారం 1.15 లక్షల జనాభా ఉంది. ప్రస్తుతం 1.50 లక్షలకు పైగా జనాభా పెరిగిందని అంచనా. ప్రతి నియోజకవర్గంలో 4-6 మండలాలు ఉంటే ఆదోని నియోజకవర్గం ఒకే మండలంగా ఉంది. పాలన పరంగానే కాకుండా నిధుల పరంగా కూడా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఆదోనికి అతి సమీపంలోనే పెద్దకడబూరు, ఆలూరు, ఆస్పరి మండలాలకు చెందిన దాదాపు పది గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సరిహద్దులు, భౌగోళిక స్వరూపం, చారిత్రాక నేపథ్యం పరిశీలిస్తే, 10-12 గ్రామ పంచాయతీలు కలిపి ఒక మండలంగా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అదే జరిగితే ఆదోని, పెద్దతుంబళం, పెద్దహరివాణం లేదా మదిరె, మండిగిరి నాలుగు మండలాలుగా విభజించే అవకాశం ఉంది. 6 గ్రామ పంచాయతీలతో మద్దికెర మండలం ఏర్పాటు చేసినప్పుడు 40 గ్రామ పంచాయతీలు కలిగిన ఆదోని మండలాన్ని నాలుగు మండలాలుగా విభజించడంలో తప్పేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అదే జరిగితే ఆదోని జిల్లాగా ఏర్పాటులో కూడా ఎంతో కీలకంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలాగే జిల్లాలో అతిపెద్ద మండలాల్లో దేవనకొండ ఒకటి. 44 గ్రామాలు, 36 గ్రామ పంచాయతీలు, లక్షకు పైగా జనాభా కలిగిన మండలం ఇది. ఈ మండలాన్ని కూడా ప్రజల సౌలభ్యం కోసం దేవనకొండ, తెర్నేకల్లు, పి.కోటకొండ మూడు మండలాలుగా విభజించాలనే డిమాండ్ బలంగా ఉంది. మూడు నాలుగు మజారా గ్రామాలతో ఉన్న పంచాయతీలను కూడా విభజించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

మారనున్న మండలాల సరిహద్దులు

- గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక స్వపరిపాలన, ప్రజల ముంగిటకే పాలన లక్ష్యంగా 1985లో అప్పటి సీఎం ఎన్టీఆర్ ప్రభుత్వం మండల వ్యవస్థను తీసుకొచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 53 మండలాలు ఏర్పాటు చేశారు. నాడు రాజకీయ జోక్యంతో పలు గ్రామాలు సమీపం మండలంలో కాకుండా 35-40 కి.మీల దూరంలో ఉండే మండలాల్లో కలపడంతో 40 ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- ఎమ్మిగనూరు పట్టణానికి 2-3 కి.మీల దూరంలో ఉండే హనుమాపురం గ్రామాన్ని 17-20 కి.మీల దూరంలో ఉండే పెద్దకడుబూరులో కలిపేశారు. అప్పట్లో ఈ గ్రామం దివంగత మాజీ ఎమ్మెల్యే కేఆర్ హనుమంతరెడ్డి ప్రాబల్యంలో ఉండేది. నాడు టీడీపీలో ఉన్న ప్రస్తుత వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి రాజకీయ ఆలోచనతో పెద్దకడుబూరులో కలిపేశారని అంటున్నారు. తాజాగా పునర్విభజన పక్కాగా జరిగితే హనుమాపురం గ్రామం ఎమ్మిగనూరు మండలంలో కలిపే అవకాశం ఉంది.
- కోడుమూడు పట్టణానికి కన్నూరు, మాచాపురం, బోదేపాడు, లింగందిన్నె గ్రామాలు 2-5 కి.మీల దూరంలో ఉన్నాయి. వీటిని 18-20 కి.మీల దూరంలో ఉన్న గోనేగండ్ల మండలంలో కలిపారు. ఈ గ్రామాల్లో అప్పట్లో దివంగత మాజీ సీఎం కోట్ల విజయ భాస్కరరెడ్డి ప్రాబల్యం కింద ఉండడంతో రాజకీయ జోక్యంతో గోనేగండ్లలో కలిపారు. కోడుమూరు మండలంలో విలీనం చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.
- కోసిగి మండల కేంద్రానికి పీకలబెట్ట, బాపులదొడ్డి, గవిగట్టు గ్రామాలు 3-6 కి.మీల దూరంలో ఉన్నాయి. వీటిని 17-20 కి.మీల దూరంలో ఉన్న పెద్దకడుబూరు మండలంలో కలిపారు. అలాగే 6 కి.మీల దూరంలో ఉన్న తిప్పలదొడ్డి గ్రామానికి 15 కి.మీల దూరంలో ఉండే కౌతాళంలో కలిపారు. ప్రజల సౌకర్యార్థం ఆ గ్రామాలు కోసిగి మండలంలో కలపాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు.
- ఆదోని పట్టణానికి 8 కి.మీల దూరంలో ఉండే తంగరడోణ గ్రామాన్ని 20-22 కి.మీల దూరంలో ఉండే ఆస్పరి మండలంలో, 8-10 కి.మీల దూరంలో ఉండే మూసానపల్లి గ్రామాన్ని 20-22 కి.మీల దూరంలో ఉండే ఆలూరు మండలంలో కలిపారు.

బైక్ అదుపుతప్పి వీఆర్‌వోకు తీవ్ర గాయాలు

ఆళ్ళగడ్డ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా వీఆర్‌వోగా పనిచేస్తున్న వెంకటపతి బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డారు. గురువారం విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై ఎండకండ్ల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా కుక్కల గుంపు వెంటపడింది. ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో వీఆర్‌వోకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. రోజురోజుకూ కుక్కల బెడద అధికమౌతుందని, అధికారులు వెంకటనే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి బయటపడ్డానని బాధితుడి తెలిపారు.

ఎర్రగుడిలో ఘర్షణ.. ఐదుగురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడి గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మద్దినేని రమేష్‌బాబు తెలిపారు. గురువారం గ్రామానికి చెందిన వెంకటేశ్వ రరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి మధ్య గొడవ జరిగింది. తనపై వెంకటేశ్వరరెడ్డితో మరో ఐదుగురు దాడి చేసినట్లు బాధితుడు రామ్మోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇదేమి విచారణో..!

- ఆరు నెలల క్రితం ఫిర్యాదు
- ఇప్పుడు విచారణకు వచ్చిన అధికారులు
- మూడు మాసాల కిందటే కథ సుఖాంతం



విచారణ చేస్తున్న అధికారులు

మద్దికెర, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో కుమారుడి విషయంలో జాతీయ బాలల పరిరక్షణకు ఆరునెలల క్రితం ఫిర్యాదు చేశారు. అయితే అప్పుడు ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు ఆలస్యంగా స్పందించారు. కాగా ఇప్పటికే ఆదంపతులు రాజీ అయ్యారు. విచారణకు వచ్చిన అధికారులను ఇదేమి విచారణ బాబోయ్ అంటూ స్థానికులు అవాక్కయ్యారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మద్దికెరలోని రామ్‌నగర్‌లో నివసించే శ్రీరాములు, శ్రీదేవి దంపతుల కూతురు వరలక్ష్మి. ఐదేళ్ల క్రితం ఆమెను గుంతకల్లు పట్టణానికి చెందిన చరణ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి రెండేళ్ల క్రితం సంజయ్‌రాం అనే కొడుకు పుట్టాడు. ఎనిమిది నెలలుగా భార్యా భర్తలకు కుటుంబ కలహాలు వచ్చాయి. దీంతో ఆమె పుట్టినిల్లు అయిన మద్దికెరకు బాబుతో పాటు వచ్చి ఉంది. రెండు నెలల తర్వాత తన కొడుకు సంజయ్‌రాంను భార్య అవ్వతాతలు సరిగా చూడటం లేదంటూ చరణ్ ఆరు నెలల కింద జాతీయ బాలల సంరక్షణకు ఫిర్యాదు చేశారు. గురువారం డీసీపీవో శారద, ఎన్‌సీపీవో శ్రీలక్ష్మి, తహసీల్దార్ గుండాల్ నాయక్, ఏఎస్‌ఐ శంకర్ విచారణ నిమిత్తం మద్దికెరకు వచ్చారు. భార్యాభర్తలు మూడు నెలల క్రితమే రాజీ అయి కాపురం సవ్యంగా చేసుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలపడంతో అధికారులు కంగుతిన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ అందుబాటులో లేకపోవడంతో అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

అప్పు తీర్చమని అడిగినందుకే హత్య

- కంట్లో కారం పొడి మారణాయుధాలతో దాడి
- నిందితులు అరెస్ట్.. ఇనుపరాడ్లు, సుత్తి, కత్తి స్వాధీనం
- పాణ్యం సీఐ కిరణ్‌కుమార్

పాణ్యం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చమని అడిగినందుకే అశోక్ (37)ను దారుణంగా హత్య చేశారు. పాణ్యం సమీపంలో గోరుకల్లు రస్తాలో ఈ సంఘటన ఈనెల 20వ తేదీన చోటుచేసుకోగా నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం పాణ్యం సీఐ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆళ్లగడ్డ మండలం, శాంతినగరం గ్రామానికి చెందిన అశోక్ వద్ద పాణ్యంకు చెందిన ముసుగు సుబ్బయ్య రూ.48లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 26 లక్షలు తీర్చగా మిగిలిన రూ. 22 లక్షలు ఇవ్వమని అశోక్ పదేపదే ఒత్తిడి చేశాడు. ఎలాగైనా అప్పు ఎగ్గొట్టాలని సుబ్బయ్య పథకం వేశాడు. 20వ తేదీన అశోక్‌కు ఫోన్‌చేసి పాణ్యంకు పిలిపించాడు. సుబ్బయ్య, అతడి కుమారుడు సురేష్‌లు అతడితో గొడవపడ్డారు. వివాదం పెరగడంతో వారి వద్దఉన్న కారంపొడిని అశోక్ కళ్లల్లో చల్లి ఇనుపరాడ్లు, సుత్తితో తల, కడుపు, ఛాతీపై దారుణంగా పొడిచాడు. అతడు అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య శృతి ఫిర్యాదు మేరకు సుబ్బయ్య, సురేష్, తెలుగుపేటకు చెందిన సల్కాపురం రమేష్, నూలుమిల్లు కాలనీకి చెందిన ఎనకండ్ల బాలకృష్ణ, మేకలబండకు చెందిన మండ్ల మణికుమార్, గోడలచేలుకు చెందిన అనుపూరు మాబు హుశేన్‌పై హత్యకేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. సుగాలిమెట్ట సమీపంలోని ఏరాసు ప్రతాపరెడ్డి తోటలో ఉన్న నిందితులను అరెస్టు చేసి వారివద్ద నుంచి రెండు పిడి బాకులు, మచ్చుకత్తి, ఇనుప రాడ్డు, సుత్తి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను ఆళ్లగడ్డ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా మైనర్లను కర్నూలు జువెనల్ కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

కలెక్టర్‌ను కలిసిన జీఎస్టీ కమిషనర్



కలెక్టర్‌కు మొక్కను ఇస్తున్న జీఎస్టీ కమిషనర్


నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల జీఎస్టీ జాయింట్ కమిషనర్ నీరజ గురువారం కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వ కంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమె కలెక్టర్‌ను కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం జీఎస్టీకి సంబంధించి అమలు చేయాల్సిన పలు అంశాలపై వారు చర్చించారు.

నేడు టీజీవీ కళాక్షేత్రంలో 'శ్రీ చౌడేశ్వరీ దేవి వైభవం' ప్రదర్శన

కర్నూలు కల్చరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా తొగటవీర క్షత్రియ సేవా సంఘం, నందవరిక బ్రాహ్మణ సంఘం, దేవాంగ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'శ్రీ చౌడేశ్వరీ దేవి వైభవం' నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు కోఆర్డినేటర్ విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈ నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ కళా సంస్థ కళాకారులు హాజరవుతారన్నారు. నందవరం చౌడేశ్వరీదేవి దివ్యక్షేత్రం, అమ్మవారి మహిమలు, చారిత్రాత్మక నేపథ్యం ఆధారంగా రూపొందించిన ఈ నాటకాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించాలని కోరారు. నంది అవార్డు గ్రహీత పల్లేటి లక్ష్మి కులశేఖర్ రాసిన ఈ నాటకాన్ని ప్రొద్దుటూరు చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం పామిలేటి దర్శకత్వం వహిస్తున్నారు.

కీలక ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం..!

- అవుకులో 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్
- రూ.53 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ రక్షణ పనులు
- డోన్‌లో రెండు పవర్ ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్





గోరకల్లు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు(ఫైల్)

నంద్యాల, జూలై 24(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం అమరావతిలోని సచివాలయంలో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో కీలక అంశాలకు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో జిల్లాలకు పలు కీలక ప్రాజెక్టులకు అమోదం తెలిపి నిధులను కేటాయించారు. సదరు ఆమోదంతో రెండు జిల్లాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండటంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అవుకులో 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు

బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండలంలోని ఎంఎస్ ఆర్‌వీఆర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి పచ్చజెండా ఊపింది. గురువారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఆ సంస్థ ఏర్పాటు చేసే పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు నిర్మించేందుకు కేటినెట్‌లో ఆమోదం పొందింది. ఈహైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు అవుకు రిజర్వాయర్‌నుంచి పంపింగ్ ద్వారా నీటిని తోడి ఆ నీటితో విద్యుత్ ఉత్పత్తిని చేసి తిరిగి రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసే విధంగా ఈప్రాజెక్టును రూపొందించారు. ఈ పంప్డ్ హౌస్ నిర్మాణం వల్ల 800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. అవుకు మండలం ఉప్పలపాడు, జూనూతల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. 2023 డిసెంబరు 22న 4476.80 కోట్ల వ్యయంతో జలవిద్యుత్ ప్రాజెక్టు పనులపై గతంలో ఓ ప్రైవేటు కంపెనీకి అనుమతి ఇచ్చారు. ఈనేపథ్యంలో 2023లో అవుకు మండలం ఉప్పలపాడులో పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రభుత్వం మారడంతో ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ రద్దు చేశారు. తిరిగి గురువారం కేబినెట్‌లో ఆర్‌వీఆర్ ప్రాజెక్టుకు అనుమతించారు.

డోన్‌లో రెండు పవర్ ప్రాజెక్టులు

కర్నూలు, నంద్యాల జిల్లాలకు ప్రయోజనకరంగా ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వంలో కేబినెట్‌లో డోన్ నియోజకవర్గంలో రెండు పవర్ ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటికే జిల్లా యంత్రాంగం డోన్ నియోజకర్గం ప్యాపిలి మండలం కలచట్ల, కొత్తకోట గ్రామ పరిసర ప్రాంతాల్లో స్థల సేకరణ చేసి పలు అంశాలపై ప్రభుత్వానికి నివేదిక పంపారు. తాజా కేబినేట్ సమావేశంలో ప్యాపిలి మండలం కలచట్ల గ్రామ శివారులో 300 మెగా వాట్లతో విండ్ పవర్ కెపాసిటీ కలిగిన పవర్ ప్రాజెక్టుకు అనుమతించారు. పైగా సదరు ప్రాజెక్టు పనులను సైతం రిన్యూ వ్యోమన్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అప్పగించారు. ప్రాజెక్టు వ్యయం సుమారుగా రూ.1,500 నుంచి రూ.1,800 కోట్లు ఉండవచ్చు. ఆ ప్రాజెక్టు పూర్తయితే ప్రతి రోజు ప్రాజెక్టు నుంచి సుమారు 20లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. అదే మండల పరిధిలోని కొత్తకోట సమీపంలో 600 మెగావాట్లతో విండ్ పవర్ ప్రాజెక్టుకు అనుమతించారు. సదరు ప్రాజెక్టు పనులను రిన్యూ విక్రమ్ శక్తి లిమిటెడ్‌కు అప్పగించారు. సదరు ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.3 వేల కోట్లు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రతి రోజు సుమారు రూ.40 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పాదన చేసే అవకాశం ఉంది.

గోరుకల్లుకు రూ.53 కోట్లు

పాణ్యం మండల పరిధిలోని గోరకల్లు రిజర్వాయర్ (నరసింహరాయసాగర్) రక్షణ పనులకు రాష్ట్ర కేబినేట్ ఆమోదం తెలిపింది. సదరు రిజర్వాయర్ పనులకు సంబంధించి రూ.99 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపగా.. రూ.53 కోట్ల నిధులకు ప్రభుత్వం అమోదం తెలిపింది. దీంతో రిజర్వాయర్ పరిధిలో రోప్‌బండ్ లెవల్ వరకు మట్టి నిర్మాణం, వర్షపు నీరు సురక్షితంగా విడుదల చేయడానికి డ్రైనేజీ వ్యవస్థ, బండ్ పైభాగం నుంచి గేట్ వ్యవస్థ, 1500 మీటర్ల నుంచి 3,406 మీటర్ల మధ్య అప్‌స్ట్రీమ్ వాల్ రక్షణ, గ్యాలరీ మరమ్మతులు, గ్లౌడింగ్, స్లూయిజ్ గేట్ల నిర్మాణం, సెన్సార్ ఏర్పాటు, హెడ్ రెగ్యులేటర్ తదితర పనులను చేయనున్నారు.

మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట

- నేర నియంత్రణకు కృషి చేయాలి
- నేర సమీక్షలో డీఐజీ
- ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసాపత్రాలు



'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్లను విడుదల చేస్తున్న డీఐజీ, ఎస్పీ... పాల్గొన్న పోలీసు అధికారులు

కర్నూలు క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లా ఎస్పీతో కలిసి డీఐజీ కోయ ప్రవీణ్ జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. శాంతిభద్రతలను పరిరక్షణలో భాగంగా పోలీసులు సీరియస్‌గా పని చేస్తే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఉండదని తెలిపారు. జిల్లాల విభజన తర్వాత కర్నూలు రేంజ్‌లో జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం ఉందన్నారు. పాత కక్షలు లేకుండా అందరికీ కౌన్సెలింగ్ చేయాలన్నారు. అలాగే ఎక్కడైనా అల్లర్లు జరగకుండా, ఓపెన్ డ్రింకింగ్ వంటివి లేకుండా డ్రోన్ కెమెరాలతో నిఘాతో విజిబుల్ పోలిసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయిస్తే న్యాయం జరిగేలా పని చేయాలన్నారు. సాంకేతిక నైపుణ్యం బాగా పెంచుకోవాలని డీఐజీ సూచించారు. అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ సాంకేతికతను వినియోగించి నేరాల కట్టడికి బాగా పని చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌ల పరిధుల్లో సీసీ కెమెరాల పనితీరు సక్రమంగా ఉండాలన్నారు. అవసరమైన చోట పీడీ యాక్టులు, బైండోవర్లు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేయాలని ఆదేశించారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, యాంటీ ఈవ్ టీజింగ్ తనిఖీలను డ్రోన్ కెమెరాలతో ఇంకా మెరుగు పరుచుకోవాలన్నారు. ప్రాపర్టీ కేసులలో రికవరీలు చేయాలని, ప్రాపర్టీ కేసులలో నిందితుల వేలిముద్రలను సేకరించి ఛేదించాలన్నారు. కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను త్వరగా ట్రయల్‌కు వచ్చే విదంగా కృషి చేయాలన్నారు. ఫోక్సో కేసుల గురించి ఆరా తీశారు. అనంతరం గత నెలలో వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈగల్ టీం ఆధ్వర్యంలో 'గంజాయికి డ్రగ్స్‌కి గుడ్‌బై చెబుదాం, డ్రగ్స్ వద్దు బ్రో.. మాదక ద్రవ్యాల వినియోగాన్ని కట్టడి' చేయాలనే కరపత్రాలను డీఐజీ, ఎస్పీ ఆవిష్కరించారు. జిల్లాలో గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు టోల్‌ఫ్రీ నెంబర్.1972కు సమాచారం అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, హేమలత, ఏఆర్‌డీఎస్పీ భాస్కర్‌రావు, సీఐలు, ఎస్ఐలు, ఈగల్ టీం ఎస్ఐ సుజన్ కుమార్, ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

పలు ఫైళ్లకు మోక్షం

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాలకమండలి సమావేశం
- బయటకు పొక్కకుండా గోప్యత పాటించాలి
- పాలక మండలి సభ్యులకు ఓ ఉన్నతాధికారి ఆదేశం?

కర్నూలు అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆర్‌యూలో (రాయలసీమ యూనివర్సిటీ) గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న పలు ఫైళ్లకు మోక్షం లభించింది. గురువారం సాయంత్రం వర్సిటీ కాన్ఫరెన్స్ హాలు నుంచి పాలక మండలి సభ్యులతో ఉపకులపతి వి.వెంకట బసవరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, ప్రిన్సిపల్ సెక్రటరీ కోనశశిధర్, సెక్రటరీలతో కలిసి పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఓ కాంట్రాక్టు ఉద్యోగికి సంబంధించిన కోర్టు డైరెక్షన్‌లో ఉద్యోగి అంశం, పెండింగ్‌లో ఉన్న17 మంది ఉద్యోగులు, మరి కొందరు ఉద్యోగుల జీతభత్యాల పెంపునకు సంబందించిన పలు అంశాలు చర్చకు వచ్చినట్లు ఉన్నత విద్యామండలి వర్గాలు తెలిపాయి. సమీక్షలోని అంశాలు బయటకు పొక్కకుండా గోప్యత పాటించాలని వర్సిటీకి చెందిన ఓ ఉన్నతాధికారి మౌఖికంగా పాలకమండలి సభ్యులను ఆదేశించినట్లు సమాచారం. సమీక్షకు సంబంధించిన పలు అంశాలపై ఉన్నత విద్యాశాఖలోని అధికారుల వద్ద ప్రస్తావించగా మరిన్ని వివరాలను వర్సిటీ ఉన్నతాధికారులు వెల్లడిస్తారని దాటవేశారు.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో బాస్కెట్ బాల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 26న బాలబాలికల జూనియర్ బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి దాదాబాషా గురువారం తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. తమతో పాటు ఆధార్, పుట్టినతేదీ ధ్రువపత్రం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు క్రీడా ప్రాంగణంలో ఉండాలని సూచించారు. ఎంపికైన జట్టు ఆగస్టు 14 నుంచి 17 వరకు పిఠాపురంలో నిర్వహించే 10వ రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాల కోసం 9700626167, 8309561333 నంబర్లను సంప్రదించాలన్నారు.

జీజీహెచ్ కిటకిట



ఆసుపత్రిలో గుమికూడిన రోగులు

నంద్యాల హాస్పిటల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్ గురువారం రోగులతో కిటకిటలాడింది. ఓపీడీ భవనంలో మందులు తీసుకునేందుకు రోగులు బారులుదీరారు. అలాగే అల్ట్రాసౌండ్ ఓపీవద్ద అధికసంఖ్యలో రోగులు చికిత్స కోసం వచ్చారు. ఇటీవలే అల్ట్రాసౌండ్ విభాగానికి కొత్తగా వైద్యులు రావడంతో రోగులు చికిత్స కోసం జీజీహెచ్‌కు వస్తున్నారు. మూడు రోజులనుంచి ఓపీడీ విభాగంలో చికిత్సలు చేయించుకుంటున్న రోగులు మందుల కోసం క్యూకట్టారు. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు రావడంతో ప్రజలు జీజీహెచ్‌ను ఆశ్రయిస్తున్నారు.

రీ సర్వే విషయంలో ఘర్షణ

- భయాందోళనలో మారందొడ్డి గ్రామస్థులు

సి. బెళగల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని మారందొడ్డి గ్రామంలో నెల రోజులుగా రీ సర్వేను నిలిపివేశారు. గురువారం రెవెన్యూ అధికారులు రీసర్వేను ప్రారంభించారు. బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన వెంకటేశ్వర్లు, రుక్మాంగదకు పొలాలు ఉన్నాయి. రీసర్వే నేపథ్యంలో పొలాలకు రాళ్లు పాతే విషయంలో ఒకరినొకరు ఘర్షణ పడ్డారు. వెంకటేశ్వర్లు కుమారుడైన మోహన్‌నాయుడు తలకు రక్తగాయాలయ్యాయి. ఇరువురిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి మందలించి పంపారు. వెంకటేశ్వర్లు వర్గీయులు రుక్మాంగద ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. ఘర్షణ జరగడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఘర్షణ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు మారందొడ్డికి చేరుకొని ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చిరుత సంచారం

- ఎన్నెకండ్లలో దున్నపోతుపై దాడి
- భయాందోళనలో గంజిహళ్లి, ఎన్నెకండ్ల, బెల్లందొడ్డి వాసులు



గంజహళ్లి శివార్లలో చిరుత కాలి గుర్తులు, ఆందోళన వ్యక్తం చేస్తున్న సర్పంచ్, ప్రజలు

గోనెగండ్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్నెకండ్ల, గంజహళ్లి, బెల్లందొడ్డి గ్రామ శివార్లలో మూడు రోజులుగా చిరుత సంచరిస్తుంది. ఆయా గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు భయాందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి ఎన్నెకండ్లకి చెందిన నాగేంద్ర తన పంట పొలంలోని గుడిసె దగ్గర దున్నపోతును కట్టి వెళ్లాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా దున్నపోతు కనిపించలేదు. కొండ ప్రాంతాలను వెతకగా గుండ్ల మధ్యలో చిరుత దాడిలో మృతిచెందిన దున్నపోతు కళేబరం లభించింది. ఆ ప్రాంతంలో చిరుత జాడ (అడుగులు)లు కనిపించాయి. గురువారం తెల్లవారుజామున కూడా చిరుత దున్నపోతు కళేబరం ఉన్న ప్రాంతానికి వచ్చి వెళ్లినట్లు పశువుల కాపరులు తెలిపారు. చిరుత ఎన్నెకండ్ల, గంజహళ్లి, బెల్లందొడ్డి గ్రామాల పంట పొలాల్లో తిరుగుతున్నట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు. గురువారం సాయంత్రం గంజహళ్లి గ్రామ శివారులో చిరుత కనిపించడంతో గ్రామస్థులు కేకలు వేస్తూ కట్టెలతో వెళ్లారు. చిరుత చెట్ల పొదల్లోకి పారిపోయినట్లు గంజహళ్లి సర్పంచ్ రాముడు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి చిరుతను బంధించి అటవీ ప్రాంతంలో వదలాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరీదేవికి పూజలు



కర్నూలులో కలశాల్లో నవదుర్గలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న భక్తులు, కల్లూరులో పూజలందుకుంటున్న చౌడేశ్వరీదేవి

కర్నూలు కల్చరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని సప్తగిరి నగర్‌లోగల కొత్త అయ్యప్పస్వామి ఆలయం ప్రాంగణంలోని చౌడేశ్వరి మాత ఆలయంలో గురువారం అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు అమ్మవారికి పంచామృ తాభిషేకం, జ్యోతి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహికంగా లలితా సహస్రనామార్చనలు చేసి, పసుపు, చందనాలతో అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకించారు. అనంతరం పసుపు, కుంకుమ, సారె, చీరెలు, గాజులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్య క్షుడు కేఈ ప్రతాప్ కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరులో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. గురువారం ఆలయ ఈవో వై.గుర్రెడ్డి, గౌరవ అధ్యక్షులు పోలిశెట్టి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆషాఢమాసం బహుళ అమావాస్యను పురస్కరించు కుని అర్చకులు అభిషేకం, లక్షపుష్పార్చన, కుంకుమార్చన ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం చౌడేశ్వరీదేవిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు దండే వెంకటేష్, పెద్ది వరప్రసాదరావు, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, గోవిందు, బాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: చౌడేశ్వరీదేవి జయంతి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఓర్వకల్లులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు వేకువజామునే అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మండలంలోని పూడిచర్ల, కన్న మడకల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, కాల్వబుగ్గ, కొమ్ముచెరువు, హుశేనాపురం తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి

● నేటి నుంచి యథావిధిగా నీటి సరఫరా

● నగర పాలక కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం సంతోష్‌నగర్ వద్ద జాతీయ రహదారిపై 1200 ఎంఎం(డయామీటర్లు) పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. జాతీయ రహదారిపై నీరంతా చేరుకోవడంతో అధికారులు స్పందించి సుమారు 72 గంటల పాటు శ్రమించి పైప్‌లైన్ మరమ్మతు పనులను పూర్తి చేశారు. రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్న కూడా అధికారులు, కార్మికులు కృత నిశ్చయంతో నగర ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో రాత్రిం బవళ్లు కష్టపడ్డారు. ప్రధానంగా మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి అశోక్‌నగర్ నీటి శుద్ధి కేంద్రానికి నీటిని సరఫరాచేసే ప్రధాన పైప్‌లైన్ సోమవారం లీకేజీ ఏర్పడింది. తాగునీటి పైప్‌లైన్‌కు సుమారు 6 లీకేజీలు ఏర్పడ్డాయి. మంత్రి ఆదేశాలతో వెంటనే మరమ్మతు పనులు చేపట్టారు. జాతీయ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తున్నప్పటికీ వాటిని సర్వీస్ రోడ్డులోకి మళ్లించి పనులు పూర్తి చేశారు.



పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

ట్యాంకర్లతో నీటి సరఫరా..

1200 ఎంఎం పైప్‌లైన్ లీకేజీ కావడంతో కర్నూలు, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఈ రెండు నియోజకవర్గాలకు అశోక్‌నగర్ తాగునీటి శుద్ధి కేంద్రం నుంచి నీరు సరఫరా అవుతోంది. దీంతో రెండు రోజులు నగరంలో తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి తాగునీరు తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగరంలోని కొన్ని ప్రాంతాలకు అధికారులు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెలోకి వెళ్లడంతో ప్రైవేటు వ్యక్తులను వినియోగించుకుంటున్నారు.



లేబర్ కాలనీలో ట్యాంకరు వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ప్రజలందరికీ కృతజ్ఞతలు

1200 ఎంఎం పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి యథావిధిగా తాగునీరు సరఫరా అవుతుంది. కర్నూలు, కోడుమూరు నియోజకవర్గ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయితే తాగునీటి అవసరం ఉందని ఫోన్ వచ్చిన వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. కల్లూరు ప్రాంత ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేదు. రెండు రోజులపాటు సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు.

● విశ్వనాథ్, కమిషనర్, నగర పాలక కమిషనర్

పరీక్షలు బయటకు రాస్తే చర్యలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



సమీక్ష నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో రోగ నిర్ధారణ పరీక్షల కోసం రోగులను బయటి ప్రైవేటు ల్యాబ్‌లకు పంపొద్దని, ఇకపై బయటకు పరీక్షలు రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం కర్నూలు వైద్య కళాశాల సెమినార్ హాలులో వివిధ హెచ్‌వోడీలతో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఇటీవల వార్డులోకి ప్రవేశ ల్యాబ్‌కు చెందిన సిబ్బంది రోగుల నుంచి శాంపిల్స్ తీసుకెళ్తున్నట్లు తెలిసిందని, ఇక నుంచి ప్రైవేటు ల్యాబ్ సిబ్బంది వార్డులోనికి వస్తే దానికి సంబంధిత విభాగపు హెచ్‌వోడీదే పూర్తి బాధ్యత అని హెచ్చరించారు. క్యాజువాల్టీలో రాత్రి పూట డ్యూటీ అసిస్టెంట్లు ఉండటం లేదని, అకస్మికంగా తనిఖీలు నిర్వహించి విధుల్లో లేని డ్యూటీ డాక్టర్లు, సీఎంవోలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ మాట్లాడుతూ వైద్యులు సమయపాలనలో ఉండి ఎఫ్ఆర్ఎస్, ఇన్, అవుట్ అటెండెన్స్ ఖచ్చితంగా ఉండాలన్నారు. సమీక్షలో డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీరాములు, వైస్ ప్రిన్సిపాల్స్ హరి చరణ్, విజయానందబాబు, సీఎస్ఆర్ఎంవో వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి : ఏవో

సి.బెళగల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో యూరియా రైతులకు అందుబాటులో ఉందన్నారు. ఎంపీవోలు, రైతులు పాల్గొన్నారు.

జగన్ జైలుకెళ్లడం తప్పదు

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

● పాలకొలనులో 'తొలిఅడుగు'

ఓర్వకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో మాజీ సీఎం వైఎస్ జగన్ త్వరలో జైలుకెళ్లడం తప్పదని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పాలకొలను, కొమరోలు, చింతలపల్లె గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ ఏడాది కూటమి ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలు వివరించారు. గౌరు చరిత మాట్లాడుతూ సిట్టింగ్ ఎంపీ మిథున్‌రెడ్డి కేంద్రంగా జరిగిన భారీ కుంభకోణంలో అసలు సూత్రదా రులు, పాత్రదారులు భాగస్వాములు ఎవరూ కూడా చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. రూ.వేల కోట్ల సొమ్ము అంతిమ లబ్ధిదారు తాడేపల్లె ప్యాలెస్ యజమానే అని ప్రత్యేక దర్యాప్తు బృందం ఆధారాలతో రుజువు చేయబోతుం దన్నారు. జగన్‌రెడ్డితోపాటు ఎవరైతే ఉన్నారో వారందరూ జైలు ఊచలు లెక్కించక తప్పదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, సర్పంచ్‌లు చదువుల సుజాతమ్మ, వెంకటరమణ, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఉపాధ్య క్షుడు మోహన్ రెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ ముంతాజ్ బేగం, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, చంద్ర పెద్దస్వామి, భాస్కర్ రెడ్డి, మహబూబ్ బాషా, నాగ మల్లేష్, కాకి దేవేంద్ర, రామమద్దిలేటి పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్: ప్రజాశ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండలం దిన్నెదేవర పాడు పంచాయతీ పరిధిలో ఉన్న అంబేద్కర్ నగర్‌లో గురువారం సుపరి పాలనలో తొలిఅడుగు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. గతవైసీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పెట్టుకొని అనేక సంస్కరణలను రూపొందించారని అన్నారు. కార్యక్రమంలో దిన్నెదేవరపాడు గ్రామ సర్పంచు మీసాల మాధవ స్వామి, స్థానిక టీడీపీ నాయకులు సుబ్బయ్య, ఆచారి, ధరూర్ గోపి పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్ అన్నారు. గురువారం నగరంలోని 4వ వార్డు పరిధిలోని కుమ్మరిగేరిలో సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందుతున్న పథకాలు, సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో దాశెట్టి శ్రీనివాసులు, మదన్, రాజేష్, భాస్కర్, నరసింహ, జావీద్, సయ్యద్ బాషా, ఫయాజ్, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

సి.బెళగల్: చంద్రబాబు ప్రవేశ పెట్టిన పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప అన్నారు. గురువారం మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామలో బూత్‌కమిటీలతో కలిసి సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ రామంజినేయులు, గోవిందు పాల్గొన్నారు.

గూడూరు: పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కురుకుంద రామాంజనే యులు అన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని ఆయా కాలనీల్లో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రేమట వెంకటేశ్వర్లు, నాయకులు డా.మన్నన్ బాషా, నాగప్ప యా దవ్, కురువ హనుమంతు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు వీర కుమార్, చాంద్‌బాషా పాల్గొన్నారు.



పాలకొలనులో ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



అంబేద్కర్‌నగర్‌లో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి



కుమ్మరిగేరిలో కరపత్రాన్ని అందిస్తున్న కేఈ జగదీష్

ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు

ఓర్వకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్ముచెరువు, కాల్వ, భైరాపురం గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి భక్తులు పూజలు చేశారు. గురువారం అమావాస్య పర్వదినం కావంతో ఆల యాలకు భక్తులు పోటెత్తారు. కొమ్ముచెరువు ఆంజనేయస్వామి ఆలయానికి జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి ఆకుపూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ఎస్ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

27న యోగా యూనియన్ ఎన్నికలు

కర్నూలు స్పోర్ట్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న స్థానిక కృష్ణానగర్‌లో ఉన్న యోగా సంఘం హాలులో జిల్లా స్థాయి యోగా యూనియన్ ఎన్నికలను నిర్వహిసున్నట్లు జిల్లా సంఘం అధ్య క్షుడు డి.లక్ష్మీకాంతరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యోగా సంఘం గుర్తింపు పొందిన అనుబంధ సంస్థల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. నూతన కమిటీ నాలుగేళ్లపాటు కొనసాగుతుందన్నారు.

కళాశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోల్స్ జూనియర్ కాలేజీకి పూర్వ విద్యార్థులు చేయూత అందించారు. 1993-1995 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలిసి విరాళాలు సేకరించి కళాశాల అభివృద్ధికి తోడ్పాటు అందించారు. 1993-95 ఇంటర్మీడియట్ విద్యార్థులు తాము చదువుకున్న కళాశాలకు మేలు చేయాలన్న ఉద్దేశంతో తరగతి గదులను ఆధునీకరించారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించాలని ఫ్యాన్లు, పెయింటింగ్, కుర్చీలు, లైట్లు, కలర్స్ వేయించారు. ప్రిన్సిపాల్ నెహమియా పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేష్, మద్దిలేటి, గోవిందు, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, మోదీన్ బాషా, పురుషోత్తం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

కర్నూలు రూరల్ జూలై 24 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు నియోజకవర్గ పరిధిలో అనారోగ్యానికి గురైన నలుగురు బాధిత రోగులకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కులు అందజేశారు. అందులో బాధిత రోగులు కర్నూలు అర్బన్ మండలం బాలాజీనగర్‌కు చెందిన వైష్ణవి రూ.56,981, కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన కుమ్మరి ఎల్లనాగన్న భార్యకు రూ.68,769, కర్నూలు మండలం సూదిరెడ్డిప ల్లెకు చెందిన బి.వెంకటేశ్వర్లు రూ. 70,000, కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన మంగలి రఘునాథ్‌కి రూ. 55,000లను ఎమ్మెల్యే చొరవ తీసుకొని రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి వారికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు చేయించారు. మంజూరైన చెక్కులను గురువారం బాధితు లకు అందజేశారు.

నేడు సంగాలకు ఎమ్మెల్యే రాక

సి.బెళగల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగాల గ్రామ సమీపంలోని చింతమానుపల్లె ఎత్తిపోతల పథకం మోటార్లను ప్రారంభించేందుకు కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, కేడీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సంగాలకు వస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు.

ఐవీఎఫ్ టెక్నాలజీ ఓ వరం లాంటిది



వేడుకల్లో పాల్గొన్న ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు డాక్టర్లు

కర్నూలు హాస్పిటల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రపంచంలో ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) చికిత్స సంతానలేమి దంపతులకు ఓ వరం లాంటిదని సీనియర్ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు డాక్టర్ బీటీ సీతా అన్నారు. నగరంలోని పార్థసారథి నగర్ ఐఎంఏ భవన్‌లో ఏపీఐఎస్ఏఆర్ కర్నూలు బ్రాంచ్ ఆధ్వర్యంలో వరల్డ్ ఎంబ్రియాలజిస్టు, ఐవీఎఫ్ డేను పురస్కరించుకుని వేడుకలను నిర్వహించారు. డాక్టర్ బీటీ సీత మాట్లాడుతూ ప్రతి ఆరుగురిలో ఒకరు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారన్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం, జంక్‌ఫుడ్స్ తీసుకోవడం, సరైన తగినంత నిద్ర పోవకపోవడం సంతానలేమికి కారణాలన్నారు. ప్రస్తుతం పురుషులు మహిళలకు ఇద్దరికి అధునాతన సంతానసాఫల్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో విష్ణుప్రియ టెస్టు ట్యూబ్ ఎండోస్కోపి సెంటర్ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు డాక్టర్ పి.విష్ణుప్రియ, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టులు డాక్టర్లు దాసరి విజయలక్ష్మి, శిరీషారెడ్డి, శ్రావ్య, భార్గవరెడ్డి శుశృత, దివ్య, కర్నూలు జీజీహెచ్ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ లక్ష్మీబాయి, డాక్టర్ రమ్య నాయక్ పాల్గొన్నారు.

జగన్ పెద్ద మోసగాడు : ధరూర్ జేమ్స్

కర్నూలు అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ పెద్ద మోసగాడని, గత ఐదేళ్ల పాలనలో 11 సీట్లకే పరిమితం చేసిన విషయం మరిచారా అని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జెమ్స్ ప్రశ్నించారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2019లో మద్యపాన నిషేధం అంటూ హామీ ఇచ్చి అమలు చేయకుండా స్కాంకు తెరలేపారన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

కర్నూలు అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై అవగాహన అవసరమని ఉపకులపతి వి.వెంకట బసవ రావు అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కర్నూలు మెడికల్ కాలేజీ వారు నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఉపకులపతి ప్రారంభించి మాట్లాడారు. రిజిస్ట్రార్ విజయకుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.నాగరాజు, సునీల్ కుమార్ యాదవ్, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల భవనాన్ని నిర్మించాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): బండిమెట్టలోని పొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాల భవనాన్ని నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం అసంపూర్తిగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని గురువారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఎండీ షరీఫ్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల అర్హతలను పునఃపరిశీలించాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్షిప్ (పీ4) పథకం కింద బంగారు కుటుంబాల అర్హతలను పునః పరిశీలించాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎస్బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో పీ4 పథకంపై అడ్మిన్ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పీ4 పథకం కింద 10,600 బంగారు కుటుంబాలను గుర్తించామని, ఈ నెలాఖరులోగా వారి అర్హతలను మారోమారు పక్కాగా పరిశీలించాలని సూచించారు. 629 మంది మార్గ దర్శకులను ఇప్పటికే ఎంపిక చేశామని, వారికి 3,709 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అనుసంధానం చేశామన్నారు. మిగిలిన బంగారు కుటుంబాలను ఆగస్టు 15లోపు దత్తత తీసుకునేలా మార్గదర్శకులను అన్వేషించాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమి షనర్ ఆర్‌జీవీ కృష్ణ, సూపరింటెండెంట్ మంజూర్‌బాషా, స్పెషల్ ఆఫీసర్ సొహైల్, కుమార్ పాల్గొన్నారు.

● దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ విశ్వనాథ్ సూచించారు. గురువారం ఆయన ఖడక్‌పుర, వడ్డేగేరి ప్రాంతాల్లో పర్యటించారు. మురుగు నీరు సక్రమంగా ప్రవహించేందుకు డ్రైనేజీ కాలువలపై ఆక్రమణలు తొలగించి అవసరమైన నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ ఆదేశించారు. సుంకేసుల రహదారిని రూ.90 లక్షల ఎన్‌క్యాప్ నిధులతో చేపట్టిన విస్తరణ పనులను పరిశీలించారు. అనంతరం సంతోష్‌నగర్ వద్ద తాగునీటి పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ శేష సాయి, డీఈఈలు గిరిరాజు, నరేష్, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వర రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొ న్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

గడియారం ఆసుపత్రి వద్ద ఆక్రమణల తొలగింపు

కర్నూలు న్యూసిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని గడియారం ఆసుపత్రి వద్ద ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. గురువారం సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ అధ్వర్యంలో ఆసుపత్రి పక్కనే రహదారిని ఆక్రమించి ఉన్న 15 దుకాణాలను తొలగించారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో దుకాణాలను తొలగించినట్లు అధికారులు తెలిపారు.

రోడ్డుపైనే వర్షపునీరు

ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు



ఓర్వకల్లులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఓర్వకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులోని ఆర్టీసీ బస్టాండు నుంచి మర్రి చెట్టు వరకు వెళ్లే రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలిచింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సీసీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అనాథ పిల్లల ఆధార్‌కు ప్రత్యేక క్యాంపు



ఆధార్ గుర్తింపును పరిశీలిస్తున్న రాయపాటి శ్రీనివాస్ తదితరులు

కర్నూలు కల్చరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బంగారుపేట సచివాలయంలో అనాథ పిల్లల స్పెషల్ ఆధార్ డ్రైవ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సాధికార కమిటీ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్ని రోజులగా తాము బంగారుపేటలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 70 మంది ఆధార్ లేని పిల్లలను గుర్తించామని, వారికి గురువారం ఆధార్ కార్డు మంజూరు చేసే ప్రక్రియను ప్రారంభించామని అన్నారు. కర్నూలు డిప్యూటీ తహసీల్దారు రవిచంద్ర, జిల్లా సచివా లయ ఆధార్ ఇన్‌చార్జి శంకర్‌రెడ్డి, సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ మోనాలీ, జిల్లా బాలల సంర క్షణ సాధికార అధికారి దీప, రంగమ్మ పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో అభ్యర్థుల ఏకగ్రీవం

కర్నూలు న్యూసిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లో గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీకి చెందిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన అభ్యర్థుల్లో సి.నారాయణ రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, సీహెచ్ సాంబశివ రావు, కురువ మునెమ్మ ఎస్.టీ.షేక్ అహ్మద్ ఉన్నారు. కార్యక్రమంలో మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

నేడు పీ-4 సమావేశం

ఆదోని టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ-4లో భాగంగా బంగారు కుటుంబాల దత్తతపై శుక్రవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. దానిష్ ఫంక్షన్ హాలులో ఉదయం 10.30 గంటలకు ప్రాంభమవుతుందన్నారు. దాతలు, వ్యాపారులు పారిశ్రామిక వేత్తలు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

జాషువా స్ఫూర్తిగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న హెచ్ఎం మల్లికార్జున

ఆదోని అగ్రికల్చర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గుర్రం జాషువా స్ఫూర్తిగా ముందుకు సాగాలని మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం మల్లికార్జున సూచించారు. గురువారం పాఠశాలలో వర్ధంతిని అరసం ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రప టానికి నివాళి అర్పించారు. అరసంజిల్లా అధ్యక్షుడు ప్రహల్లాద, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాద్, లోక్యా నాయక్ పాల్గొన్నారు.

గ్రామాలకు విద్యార్థి బస్సు నడపాలి



వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

దేవనకొండ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలకు విద్యార్థి బస్సులు నడపాలని ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శులు శ్రీనివాసులు, బాస్కర్ మాట్లా డుతూ బస్సులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడికి వెళ్లడానికి ఆటోలను ఆశ్రయిస్తు న్నారని, ఆర్టీసీ అధికారులు స్పందించాల న్నారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రవికి వినతిపత్రం ఇచ్చారు. యూసుఫ్‌బాషా, మాదన్న, రవి, తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలను మళ్లించాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాలు రాకుండా మళ్లించాలని డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనాపురం ఉదయ్ కోరారు. గురువారం ఆర్టీవో కార్యాలయానికి వచ్చిన డిస్ట్రిక్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ కృష్ణవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని భారీ వాహన రాకపోకలను నిషేధించాలన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్నారని, గుర్తించి సీజ్ చేయాలని కోరామన్నారు. చిన్న, డానియల్ పాల్గొన్నారు.



ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీఎస్ఎఫ్ నాయకులు

చెత్తను బయట వేయొద్దు

తుగ్గలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చెత్తను ఆరుబయట వేయవద్దని ఎంపీడీవో విశ్వమోహన్ ప్రజలకు సూచించారు. గురువారం మండలంలోని రాంపురంలో చెత్తబుట్టలను పంపిణీ చేశారు. వారానికోసారి ట్యాంకులను శుభ్రంచేస్తున్నామన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి కార్మికులకు అందించాలన్నారు. సర్పంచ్ కమల్, టీడీపీ నాయకులు భీమలింగప్ప చౌదరి, మాజీ సర్పంచ్ చంద్రన్న, మద్దిలేటి, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం



మద్యాన్ని చూపుతున్న ఏఈఎస్, సీఐ

ఆదోని, జూలై24(ఆంధ్రజ్యోతి): దాడుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని ఇస్వీ రోడ్డులో గురువారం ధ్వంసం చేసినట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, సీఐ సైదుల్ తెలిపారు. ఆదోని ఎక్సైజ్ పరిధిలో 94 కేసులకుగానూ 2,055 లీటర్ల కర్ణాటక మద్యంతో పాటు 17 కేసుల్లో 177 లీటర్ల సారాను ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేసినట్లు సీఐ సైదుల్ తెలిపారు. ధ్వంసం చేసిన మద్యం విలువ దాదాపు రూ.12 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు.

దాతలను గుర్తించండి

హాలహర్వి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే దాతలను గుర్తించాలని ఎంపీడీవో వరలక్ష్మి సూచించారు. గురువారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా బంగారు కుటుంబం అభివృద్ధికి సహకరించేలా చూడాలని తెలిపారు.

ప్రత్యేక పూజలు

ఆదోని టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగా భవాని ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. గంగపుత్ర సంఘం నాయకులు తెలుగు ఈరన్న, వెంకటేష్, మేఘనాథ్, బ్యాంక్ వీరేష్, తాయప్ప, దీపక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలా

● ఆగిపోయిన భవన నిర్మాణాలు ● పలుచోట్ల పాఠశాలు, అద్దె భవనాల్లో నిర్వహణ



అర్థాంతరంగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

మద్దికెర, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11 గ్రామాలు ఉండగా, 39 అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. అయితే వీటిలో 13 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా మరో 12 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన 14 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగున్నాయి. కాగా మద్దికెర, ఎం.అగ్రహారం, బురుజుల గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో భవనాల నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే అవి మధ్యలోనే నిలిచిపో యాయి. మరో 8 కేంద్రాలకు నిధులు ఉన్నా స్థలం లేక పనులు మొదలు కాలేదు. పాఠశాల భవనాలు, అద్దె గృహాల్లో కొనసాగుతున్న కేంద్రా ల్లో వసతులు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. ఐసీడీఎస్ అధికా రులు పట్టించుకోక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆరోపిస్తున్నారు.

● ఈ విషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రివేణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అలాగే నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు మధ్యలో నిలిచిపోయాయనీ, మరికొన్ని చోట్ల స్థలం కొరత ఉందని తెలిపారు.

అందరూ చదవాలన్నదే ప్రభుత్వ ధ్యేయం



రాతన గ్రామంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

తుగ్గలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని అందరూ చదువుకోవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మండలంలోని రాతన గ్రామంలో తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు వివరించి సమస్యలను తెలుసుకున్నారు. చెరువుల న్నిటినీ హంద్రీనీవా నీటితో నింపుతామ న్నారు. తుగ్గలి నాగేంద్ర, మనోహర్ చౌదరి, వెంకటపతి, కృష్ణమూర్తి చౌదరి, ఈరన్నస్వామి ఉన్నారు.

పట్టణాభివృద్ధే ధ్యేయం

ఆదోని, జూలై24(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధే తమ ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకుడు మదిర భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం జ్యోతిర్మయి కాలేజీ ప్రాంతంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం నిధులు విడుదల అవుతాయని, జాబితాలో పేర్లులేని రైతులు సచివాలయానికి వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. ఫక్రుద్దీన్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, బుద్ధారెడ్డి, గోనపాడు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుంటామన్న సీఎం చంద్రబాబు మాటలు అమలు కావడం లేదని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారులు నిర్వాహకుల నుంచి ముడుపులు తీసుకుని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపించారు. నాయకులు మరుతిరావు, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి రాష్ట్ర నాయకుడు శ్రీనాథ్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

దేవనకొండ జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపల్లి గ్రామంలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకన్నట్లు ఎక్సైజ్ సీఐ సువర్ణలత తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ సమాచారం మేరకు కర్ణాటక మద్యం కలిగిఉన్న శ్రీనివాస్, వెంకటేష్‌ను అరెస్ట్ చేసి, 5 బాక్స్‌ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.



కర్ణాటక మద్యంతో ఎక్సైజ్ అధికారులు

నేడు క్రిష్ణగిరికి మంత్రి

పత్తికొండ (క్రిష్ణగిరి) జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం క్రిష్ణగిరి మండ లంలో పర్యటించనున్నారు. విజయవాడ నుంచి రైలులో గుంతకల్‌కు చేరుకుని అక్కడి నుంచి రోడ్డుమార్గంలో వస్తారని పత్తికొండ టీడీపీ కార్యాలయం తెలిపింది. ఎమ్మెల్యే శ్యాంబాబుతో కలిసి క్రిష్ణగిరి మండలంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'లో పాల్గొని, సాయంత్రం 4 గంటలకు తిరిగి వెళతరాన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి పత్తికొండ, డోన్ పరిధిలోని చెరువులకు నేడు ఎమ్మెల్యేలు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, కేఈ శ్యాంబాబు శుక్రవారం నీటిని విడుదలచేయనున్నారు. 90 కి.మీ. ఆలంకొండ పంప్‌హౌస్ నుంచి కటారుకొండ డెలివరీ ఛానల్‌కు నీటిని ఎత్తిపోసే మోటార్లను ఆన్‌చేస్తారు. ఎంపి బస్తిపాటి నాగరాజు హాజరుకానున్నారు.

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ

ఆదోని అగ్రికల్చర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఎస్ఎఫ్ఐ కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు గురువారం తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా చరణ్ తేజ, కార్యదర్శిగా శశిధర్, ఉపాధ్యక్షుడిగా సంజయ్, ఉత్తేజ్, సహాయ కార్యదర్శులుగా హేమంత్, ఉదయ్‌తో పాటు మరో పది మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీజేపీ బలోపేతానికి సమష్టి కృషి

ఆలూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు విట్టా రమేష్ కోరారు. గురువారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీతో దేశం అభివృద్ధివైపు పయనిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఆలూరు సమగ్రాభివృద్ధి, వేదవతి, నగరడోణ ప్రాజెక్టుల నిర్మాణం, ఆలూరు తాగునీటి సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈనెల 29న కర్నూలుకు వస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వెంకటరాముడు, రవీంద్రరావు, చిదానంద, బోల్డోణ తిమ్మప్ప, పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలను పరిష్కరిస్తాం

మద్దికెర, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతి గృహంలోని సమస్యలను పరిష్కరిస్తామని సోషల్ వెల్ఫేర్ ఈఈ మురళీధర్ రెడ్డి అన్నారు. హాస్టల్ భవనం అభివృద్ధి పనులకు రూ.5లక్షల ఎంపీ నిధులు మంజూరు కావడంతో ఈఈ పరిశీలించారు. హాస్టల్ స్నానపు గదుల నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. అయితే నిధులు మంజూరు కావడంతో కాలువ నిర్మించను న్నట్లు ఈఈ తెలిపారు. అలాగే భోజనం చేసేందుకు షెడ్డును కూడా నిర్మిస్తామ న్నారు. డీఈ వీరయ్య, ఏఈ ఇసాక్ బాషా, వార్డెన్ శ్రీరాములు, మల్లికార్జున యాదవ్, ఆంజనేయులు ఉన్నారు.

వసతులు కల్పించాలి

పత్తికొండ టౌన్, జూలై24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ, వినోద్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఏపీఆర్ఎస్ బాలల హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులకు ప్లేట్లు, ట్రంకు పెట్టెలు, దుప్పట్లు అందించాలని, కమాటీ, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రంగస్వామి, బాబు, మనోహర్ ఉన్నారు.

పాఠశాల భవనాలపై నివేదిక

ఆలూరు, జూలై24(ఆంధ్రజ్యోతి): మండలంలో నాడు-నేడు కింద నిలిచిపోయిన పాఠశాలల భవనాలపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఎంఈవో-2 చిరంజీవి రెడ్డి తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ' గదులు సరిపోక బోధన సాగక' శీర్షికన ప్రచురితమైన కథనానికి మండలంలో 30 పాఠశాలల్లో అదనపు భవనాలు పూర్తికా లేదని, నిధులు విడుదల చేయాలని ఉన్నతాధికారులను కోరామన్నారు.

తరగతి గదులను పూర్తి చేయాలి

ఆలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాడు-నేడు కింద ఆగిపోయిన పాఠశాల భవనాలను పూర్తిచేయాలని పీడీఎస్‌యూ మండల కార్యదర్శి దుర్గానాయక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో ఆయన మట్లాడుతూ ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదన్నారు.

దత్తతకు ముందుకు రావాలి

పత్తికొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన బంగారు కుటుంబాలను దత్తతకు ముందుకు రావాలని ఎంపీడీవో కవిత సూచించారు. గురువారం పత్తికొండ 3 సచివాలయం-3లో పీ4 నిర్వహిచారు. దత్తత కోరే కుటుంబాలు ఇప్పటికే సచివాలయల్లో వివరాలు నమోదు చేసుకున్నాయన్నారు. ఆర్థికసాయం మాత్రమే కాకుండా ఎలాంటి సాయమైనా చేయవచ్చని తెలిపారు. సర్పంచ్ కొమ్ముదీపిక, డిప్యూటి ఎంపీడీవో నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో కవిత

రోడ్లపైనే మురుగు

ఆస్పరి, జూలై24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిలి గ్రామంలో రోడ్లపైనే మురుగు పారుతోంది. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన నాయకులు అనంతరం పట్టించుకోవడం లేదని గ్రామసస్థులు ఆరోపిస్తున్నారు. మూడు ప్రధాన రహదారుల కూడలి వద్ద తిప్పన్న తాత ఆలయ సమీపంలో మురుగు చేరి అవస్థలు పడుతుతా న్నమని, కాలువలను నిర్మించాలని కోరుతున్నారు.



చిగిలిలో రోడ్డుపైనే పారుతున్న మురుగు

ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

ఆలూరు రూరల్, జూలై24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆరోపించారు. గురువారం ఆర్అండ్ బీ అతిథిగృహంలో ఆగస్టు 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల, వేదవతి, నగరడోణ ప్రాజెక్టుల విషయంలో కాలయాపన చేస్తోందని విమర్శించారు. జింకల బారి నుంచి పంటలను కాపాడేందుకు పార్కును ఏర్పాటు చేయాలన్నారు. హత్తిబెళగల్ గ్రామం క్వారాలో 2018లో పేలుళ్లతో 10 మంది కూలీలు మృతిచెందినా తిరిగి అనుమతి ఇవ్వడం సరికాదన్నారు. కాక భూపేష్, రామాంజనేయులు, మారెప్ప, బాషా, చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అమావాస్య పూజలు

హొళగుంద, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం అమావాస్య పూజలు నిర్వహించినట్లు పూజారి మహేష్ స్వామి తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, గిరిమల్లేష్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారన్నారు. ఆంధ్ర, కర్ణాటక భక్తులు మొక్కులు చెల్లించుకున్నారని, వారికి అన్నదానం చేశామన్నారు.



పూజలు చేస్తున్న వీరభద్ర గౌడ్

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అన్యాయం



మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి వీరేష్

ఆదోని అగ్రికల్చర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను బలవంతంగా ఏర్పాటు చేయడం అన్యాయమని సీపీఐ కార్యదర్శి వీరేష్, సీపీఎం కార్యదర్శి లింగన్న అన్నారు. గురువారం ఏఐవైఎఫ్ కార్యాలయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 2024 ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి, గెలిచాక కొనసాగించడం ఏంటని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లతో వినియోగదారులకు కలిగే నష్టాన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వివరించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అజయ్ బాబు, కల్లుబావి రాజు, లక్ష్మన్న, వెంకప్ప, సుదర్శన్ విజయ్‌కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

మైనింగ్‌లో అవకతవకలు

పత్తికొండ టౌన్, జూలై 24 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గంలోని జొన్నగిరి ప్రాంతంలో చేస్తున్న జియో కంపెనీ చేస్తున్న బంగారం మైనింగ్‌లో అవకతవకలు చోటు చేసుకున్నాయని కాంగ్రెస్ ఇన్‌చార్జి క్రాంతినాయుడు ఆరోపించారు. గురువారం ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందించారు. గత ప్రభుత్వంలో 75 శాతం స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లింపులోన అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కంపెనీ వేసిన రోడ్లు, రహదారులు అధ్వానంగా మారాయన్నారు. సంస్థపై చర్యలు తీసుకోకుంటే హైకోర్టు, లోకాయుక్త దృష్టికి తీసుకెళతామన్నారు.



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న క్రాంతినాయుడు

తప్పు చేస్తే ఉపేక్షించం

● డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి



విచారణ చేస్తున్న డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

ఆదోని, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తప్పు చేస్తే ఉపేక్షించమని డిస్ట్రిక్ట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి హెచ్చరించారు. గత నెల 4వ తేదీన ఆదోని ఆర్టీవో కార్యాలయం ఉద్యోగి మనోహర్, ఏజెంట్ అల్తాఫ్‌ను గురువారం విచారణ చేశారు. ఇరువురిని కూర్చోబెట్టి మాట్లాడామని, ఇలాంటి ఘటనలు పునరావృత్తం కావని లిఖితపూర్వకంగా ఇచ్చారన్నారు. ప్రజలు రవాణా సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చన్నారు. దళారులను ఆశ్రయించవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును మాత్రమే చెల్లించాలని అన్నారు. కర్నూలు ఉప రవాణ అధికారి శాంతకుమారి, ఎంవీఐ సినిర దీప్తి ఉన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేత



నిత్యావసరాలను అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆదోని టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీవన జ్యోతి అనాథ వృద్ధాశ్రమానికి లయన్స్ క్లబ్ సభ్యులు గురువారం నిత్యావసరాలను అందజేశారు. జిల్లా చైర్మన్ డా. గోపీనాథ్ మాట్లాడుతూ క్లబ్ తరఫున ఉచిత వైద్య శిబిరాలతోపాటు జీవన జ్యోతి ఆశ్రమం వృద్ధులను దృష్టిలో ఉంచుకొని నిత్యావసరాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రసాదరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మారెడ్డి, శ్రీనాథ్ గుప్తా, కోశాధికారి వన్నప్ప రాజు, విశిష్ట సభ్యులు గోవింద రాజమూర్తి, ఓం ప్రకాష్, నీల మోహన్ పాల్గొన్నారు

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● హాలహర్వి ఎస్ఐ మారుతి



హాలహర్వి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచామని ఎస్ఐ మారుతి తెలిపారు.

ప్రశ్న: మండలంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి?

జవాబు: మండలంలో శాంతి భద్రతలు అదుపులో వున్నాయి. గ్రామాల్లో గొడవలు లేవు.

ప్రశ్న: పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉందా?

జవాబు: సిబ్బంది తక్కువగా ఉన్నారు. సమస్య తలెత్తితే గ్రామాలకు వెళ్లడానికి ఇబ్బంది. పడుతున్నాం. విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

ప్రశ్న: సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టారా?

జవాబు: నిఘా ఉంచాం, గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్రశ్న: కర్ణాటక మద్యాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: సరిహద్దుల్లో నిఘా కేంద్రాలు ఏర్పాటు చేశాం. కర్ణాటక మద్యాన్ని అరికడుతున్నాం.

ప్రశ్న: ఇసుక అక్రమ రవాణా పై చర్యలు తీసుకున్నారా?

జవాబు: ఇసుకను అనుమతి లేకుండా రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం. పంచాయతీ అనుమతి ఉంటేనే ఉచితంగా ఇసుక తీసుకెళ్లడానికి అనుమతిస్తాం.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. రోడ్డు మలుపులు ఉన్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. వాహనాలను తనిఖీచేసి, నిబంధనలు ఉల్లఘించిన వారికి జరిమాన విధిస్తున్నాం.

జేసీపై మాలమహానాడు ఆగ్రహం

ఎమ్మిగనూరు టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి బీసీ అధికారిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై మాల మహానాడు రాష్ట్రకార్యదర్శి నరసన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జేసీ ప్రభాకర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హుసేనప్ప, రాజులప్ప, పంపయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీవీకి మంత్రి పదవి ఇవ్వాలి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి మంత్రి వర్గ విస్తరణలో మంత్రి పదవి ఇవ్వాలని మండల పరిధిలోని కె.తిమ్మాపురం ఉప సర్పంచ్ ఉరుకుంద డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సంక్షేమంతో పాటు, అభివృద్ధిని చేస్తున్నారన్నారు. అభివృద్ధి కోసం పాటు పడుతున్న ఎమ్మెల్యే బీవీకి మంత్రి వర్గ విస్తరణలో మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీవీకి మంత్రి పదవి ఇస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో బూత్ కన్వీనర్ శ్రీరాములు ఉన్నారు.

మహిళ ఆచూకీ లభ్యం

మంత్రాలయం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చి తుంగభద్ర నదిలో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన మహిళా ఆచూకీ లభ్యమైనట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు. గురువారం తుంగభద్ర నదిలో మహిళా మృతదేహాన్ని కనుగొని గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. పత్రికలు, మీడియా ద్వారా తెలుసుకున్న కుటుంబసభ్యులు బెంగుళూరు చెందిన మంగమ్మ (68)ని గుర్తించారు. రెండు నెలల క్రితం సొంత చెల్లెలు గంగమ్మ మృతి చెందడంతో మనోవేదన చెంది ఈ నెల 22న తెల్లవారుజామున ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా మంత్రాలయం వచ్చింది. 23న తుంగభద్ర నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మహిళ కనబడటం లేదని వారి బంధువులు బెంగుళూరు పోలీస్ స్టేషన్‌లో మహిళ అదృశ్యంపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఈ విషయం బెంగుళూరు పోలీసులు మంత్రాలయంలో మృతి చెందినట్లు తమ వద్ద పోటోలు వచ్చాయని చెప్పడంతో గురువారం సాయంత్రం మృతురాలి బంధువులు మంత్రాలయం వచ్చి ఎమ్మిగనూరు ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు.

8.8 ఎంఎం వర్షపాతం నమోదు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో 8.8 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలంలోని సిరాల దొడ్డి, కడివెళ్ల, కందనాతి, మసీదుపురం, గుడికల్లు, బనవాసి, కె.తిమ్మాపురం, కలుగొట్ల తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి మోస్తారు వర్షం కురిసిందన్నారు. మండలంలో ఎక్కడా పిడుగులు పడలేదని, రైతులకు, ప్రజలకు ఎలాంటి ఆర్థిక నష్టం జరగలేదన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

నందవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వల్లే అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని టీడీపీ నాయకులు బెస్తా ఈరన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మల్లికార్జున అన్నారు

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథం పై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాఢమాస అమావాస్య రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు.



స్వర్ణ రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నూలు టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి గురువారం ఉదయం మంత్రాలయానికి వచ్చారు. ఈయనకు ఆలయ మహ ముఖద్వారం వద్ద జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, వ్యాసరాజ ఆచార్‌లు ఘనంగా స్వాగతం పలికారు.గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి ఉత్సవాల ఆహ్వాన పత్రిక, ఫల, పుష్ప, మంత్రాక్షితలు , పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కారించారు.

శ్రీమఠం అభివృద్ధి పనుల పరిశీలన

శ్రీమఠంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులతో కలసి టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి పరిశీలించారు. పుష్కరణి, గర్భగుడి శిలామంటపం పై భాగాన బంగారు పూత, మంచాలమ్మ గుడికి బంగారు తలుపులు, క్యూలైన్లు వంటి పనులను పరిశీలించారు. మఠం మేనేజర్ సురేష్ కోణాపూర్, ఓబులయ్యలు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథం పై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవలో భాగంగా ఉత్సవ మూర్తిని ఊయలలో ఊరేగించారు.

మంత్రాలయంలో భక్తుల సందడి

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. గురువారం రాఘవేంద్రస్వామికి ఇష్టమైన దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహరాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. వేలాదిగా పాల్గొన్న భక్తులు పీఠాధిపతుల ఆశీస్సులు పొందారు. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జీలు, పూజా సామాగ్రికి డిమాండ్ పెరిగింది.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి హైదరాబాద్‌కు చెందిన (వెంకటేశ్వర) అబోడే హోటల్ యజమాని రామస్వామి వెంకటరమణ రూ.లక్ష అన్నదానానికి విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్‌లు తెలిపారు. గురువారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానానికి రూ. లక్ష చెక్కును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. అదే విధంగా మంత్రాలయంలో నూతనంగా నిర్మించే హోటల్ నమూనాను పీఠాధిపతి పరిశీలించారు

యడ్యూరప్పకు ఉత్సవ ఆహ్వానం

రాఘవేంద్ర స్వామి 354వ సప్తరాత్రోత్సవాలకు రావాలని కర్ణాటక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్పకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీకృష్ణ కౌశిక్‌లు ఆహ్వాన పత్రికను అందజేశారు. గురువారం బెంగుళూరులోని యడ్యూరప్ప నివాసంలో కలిసి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఇచ్చిన మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చాను. అనంతరం పీఠాధిపతితో ఫోన్‌లో మాట్లాడారు.

వైఎస్ జగన్‌పై బీటీ నాయుడు ఫైర్



పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ, టీడీపీ ఇన్‌చార్జి

కోసిగి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని వైఎస్ జగన్మోహన్ రెడ్డి. రాష్ట్రానికి ఏం న్యాయం చేస్తాడనీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్సీ బీటీ నాయుడు స్వగ్రామమైన జుమాలదిన్నెలో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ఇంటింటికి తిరిగి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, రాకేష్ రెడ్డి, రామకృష్ణ, నాడిగేని తాయన్న, నర్సారెడ్డి, ఈరన్న, అనంతసేనా రెడ్డి, ఖలందర్, గౌస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్లియర్ చేసిన రాఘవేంద్రరెడ్డి

శ్రావణ మాసం అమావాస్య సందర్భంగా గురువారం ఉరుకుంద క్షేత్రానికి వందలాది వాహనాలు మండల పరిధిలోని జుమాలదిన్నె గ్రామంలో భారీగా ట్రాఫిక్ జామై సుమారు 2 గంటల పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే ట్రాఫిక్‌లో ఇరుక్కున్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి స్వయంగా తన వాహనం నుంచి దిగి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోలీసుల సహాయం తీసుకుని క్లియర్ చేశారు. హోదా అడ్డు రాకుండా భక్తుల బాదలు తెలుసుకుని ట్రాఫిక్ క్లియర్ చేయడంపై భక్తులు స్వామివారి దర్శనానికి ఉరుకుంద క్షేత్రానికి సంతోషంగా వెళ్లిపోయారు.

కోసిగి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు కమిటి నుంచి కమ్మలదిన్నె వరకు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దావీదు, జిల్లా కార్యదర్శి గుమ్మల బాబులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యల్లప్ప, కౌలన్నరాజు, లక్ష్మన్న పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కోసిగి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ అన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని వీరేష్ కోరారు. మండల సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యక్షుడు సంతోష్, గురుస్వామి, రవి, పాల్గొన్నారు.

హాస్టల్ నిర్మాణం త్వరగా చేపట్టాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ హాస్టల్ పనులను త్వరగా పూర్తి చేయాలని జైబీమ్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చిక్కం జానయ్య కోరారు. ఎమ్మిగనూరులో అంబేద్కర్ భవననిర్మాణంకు ప్రభుత్వం ఇది వరకే స్థలం కేటాయించినప్పటికి ఇంతవరకు భవన నిర్మాణం చేపట్టలేదు అని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్యకు తెలిపారు. అనంతరం రాష్ట్ర విద్యా భవన్ జాయింట్ సెక్రెటరీ సుబ్బరాయుడుకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదాసుల రాజబాబు, కరుణబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం సీఐకి ఉత్తమ పురస్కారం



అవార్డు అందుకుంటున్న సీఐ

మంత్రాలయం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తున్న రామాంజులు ఉత్తమ సేవా పురస్కారం అవార్డు అందుకున్నారు. గురువారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని సీఐ రామాంజులు అందుకున్నారు. తుంగభద్ర నదిలో మాధవరం చెందిన కొప్పురప్ప అనే వ్యక్తి నది ప్రవాహంలో కొట్టుకుపోతుండగా.. ఆర్డీఎఫ్ బృందాలు, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్‌తో పాటు సీఐ రామాంజులు కొప్పురప్పను కాపాడి ఒడ్డుకు చేర్చారు. అదే విధంగా భక్తలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు, శాంతి భద్రతలు అదుపు చేసిన మంత్రాలయం సీఐ రామాంజులును అభినందిస్తూ జిల్లా ఎస్పీ గుర్తించి ప్రశంసాపత్రం అందించి అభినందించారు.

'సోమప్ప సర్కిల్ పేరు మారదు'

ఎమ్మిగనూరు జూలై24(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ నడిబొడ్డున ఉన్న సోమప్ప సర్కిల్ పేరు మార్చుతున్నారన్న అపోహాలు ప్రజలు నమ్మెద్దని, సర్కిల్ పేరు మార్చే ప్రసక్తే లేదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేష్, టౌన్ బ్యాంకు వైఎస్‌చైర్మన్ నరసప్ప, నాయకులు మిన్నప్ప, బుగిడే నాగరాజు తెలిపారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోమప్ప సర్కిల్‌లో వంద అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆలోచన చేశారని దాన్ని వక్రీకరిస్తు కొంతమంది సోమప్ప సర్కిల్ పేరు తొలగిస్తున్నారని ప్రచారం చేస్తున్నారన్నారు. తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొదన్నారు. సమావేశంలో నాయకులు దామానరసింహులు, ఈరన్న, కామర్తి మహేష్, క్యాబర్సి శ్రీనివాసులు, బీమేష్‌లు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు వేగవంతం చేయండి

పెద్దకడుబూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ సేవలను మరింత వేగవంతం చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎమ్మిగనూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన పింజరి దస్తగిరి కుటుంబానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లయ్య రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బుడ్డ ఈరన్న, ఉరుకుందు, మోహన్‌లు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలి



తాహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మంత్రాలయం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కల్లుదేవకుంట గ్రామంలో ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, హైకోర్టు అడ్వకేట్ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో కల్లుదేవకుంట గ్రామస్థులు భీమయ్య, రామాంజిని, ఎల్లప్ప, వెంకటేశ్‌లు తహసీల్దార్ రమాదేవిని కోరారు. గురువారం పురుషోత్తంరెడ్డితో పాటు గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈడిగ నరసయ్య, శివ, ఎల్లప్ప, గోవిందాచారి, కొండయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

పింఛన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నందవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): డప్పు కళాకారుల పింఛన్లను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్ డిమాండ్ చేశారు. అధ్యక్ష, కార్యదర్శిగా జయరాజు, చిన్నరాజు, ఉపాధ్యాక్షుడిగా ప్రసాద్, తిమ్మప్ప, నరసన్న, సహయ కార్యదర్శిగా బజారిని ఎన్నుకున్నారు.

టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరు టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అందరికీ ఇంటి పథకం కింద ఎమ్మిగనూరు మునిసిపల్ పరిధిలోని ప్రభుత్వం టిడ్కో ద్వారా నిర్మించిన జీ+3 ఇళ్లలో వివిధ కేటగిరీల క్రింద 131 ప్లాటులు ఖాళీగా ఉన్నాయని, వాటి కోసం ఆసక్తి కలిగి అర్హత గల లబ్ధిదారులు ఏడు రోజుల్లో సంబంధిత వార్డు సచివాలయము నందు దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరారు. వివిధ కేటగిరిల యందు ఖాళీగా ఉన్నటువంటి ఇళ్ల వివరాలు ఇలా.. కేటగిరి-2 రూ 25వేలు, కేటగిరి - 3 రూ 50వేలు చెల్లించాలన్నారు. పూర్తి సమాచారం కోసం సంబంధిత సచివాలయాను సంప్రదించాలని అన్నారు.

పీఏసీఎస్ ఛైర్మన్‌గా విరూపాక్షి రెడ్డి



ఎమ్మిగనూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని పీఏసీఎస్ ఛైర్మన్ కడిమెట్ల విరుపాక్షిరెడ్డి తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితో పాటు మార్కెట్ ఛైర్మన్, నియోజకవర్గంలోని ప్రముఖులు హాజరవుతారన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలి



దుకాణదారులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి

నందవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు, మందులతో పాటు తప్పని సరిగా రసీదులు ఇవ్వాలని ఎరువుల దుకాణదారులకు వ్యవసాయ అధికారి (ఏవో) సరిత సూచించారు. గురువారం నందవరం, నాగలదిన్నె, ఇబ్రహింపురం గ్రామాల్లోని ఎరువుల దుణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు పరిశీలించారు. స్టాక్ వివరాలు అడిగి తెలుసుకుని గోడౌన్లను పరిశీలించారు. యూరియాను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రం అమ్మాలన్నారు. ఎక్కువ ధరకు అమ్మిన తమ దృష్టికి వచ్చిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణ యజమానులతో మాట్లాడి ఆ ఎరువులను తాత్కలికంగా అమ్మకాలను నిలుపుదల చేయించారు.

చేనేత కార్మిక నాయకుడి మృతి

ఎమ్మిగనూరు జూలై24(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన చేనేత కార్మికనాయకుడు వేదాంత మూర్తి(71) అనారోగ్యంతో మృతి చెందాడు. వేదాంత మూర్తి చేనేత కార్మికుడుగా పనిచేస్తు చేనేతకార్మికుల సమస్యలకోసం తోటి కార్మికులతో కలిసి చేనేతకార్మిక సంఘం నాయకుడిగా ఉంటు పోరాటాలు చేసి చేనేతనాయకుడిగా గుర్తింపు పొందాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాదుపడుతున్న ఆయన బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చేనేతనాయకులు రామచంద్ర, వైడబ్యూసీఎస్ మాజీ డైరెక్టర్ నాగరాజులు మృతదేహనికి పూలమాలలు వేసి నివాళిఅర్పించారు.